Pubilshed from Visakapatnam

PRGI NO : APTEL/25/1888

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విశాఖపట్నం VISAKAPATNAM | సంపుటి : 01 | సంచిక : 301 | మంగళవారం | నవంబర్ 3, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 01 | Issue No :301 | Tuesday | 3 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



### రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి

- అందుకు రాప్తాడులో విద్యార్థినిపై దాడి ఉదాహరణ
- స్కూల్‌తో సంబంధం లేని వ్యక్తి ఏకంగా ఆయుధంతో రావడమా?
- ఎలక్ట్రిక్ రంపంతో క్లాస్‌రూమ్‌లో విద్యార్థిని గొంతు కోయడమా?
- స్కూళ్లలో చదువుకునే పిల్లలకే రక్షణ లేకపోతే ఎలా?
- విద్యార్థిని గోపికకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి
- లేనిపక్షంలో మా ప్రభుత్వం వచ్చాక మేమే ఇస్తాం
- ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో ఆ సాయం చేస్తాం :వైయస్ జగన్

2 లో

బెంగళూరు : రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలకు అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినిపై జరిగిన దాడి ఉదాహరణ అని మాజీ ముఖ్య మంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. స్కూల్‌తో సంబంధం లేని వ్యక్తి ఎలక్ట్రిక్ రంపం తీసుకొచ్చి, ఏకంగా క్లాస్‌రూమ్‌లోనే, పిల్లలందరి ముందు పదవ తరగతి విద్యార్థిని గొంతు

# తీవ్రత తక్కువే.. అయినా అప్రమత్తత ముఖ్యం



## దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలకు అవకాశం

- 50 టీఎంసీల మేర వరద ప్రవాహాలు వస్తాయని అంచనా
- సమర్థ నీటి నిర్వహణతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- మురసు తుఫాను సన్నద్ధతపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. అర్నబ్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఇప్పుడు మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను కారణంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి పంపించామని అధికారులు వివరించారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు.

**పల్నాడులో అత్యధిక వర్షపాతం అంచనా :** మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని

2 పేజీలో..

## రామ్‌లీలా మైదాన్ ర్యాలీ

### ఎఫ్ఐఆర్ నమోదు




న్యూఢిల్లీ : ఇండియా బ్లాక్ నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో చేపట్టిన 'చలో ఢిల్లీ' మార్చ్‌పై మోడీ ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కింది. రామ్‌లీలా మైదాన్‌లో ఒక పోలీసు వాహనంపై అభ్యంతర కరమైన వార్తలు రాసిన ఘటనపై ఎఫ్ఐఆర్ న మోదు చేసినట్లు ఒక అధికారి సోమవారం తెలిపారు. ఢిల్లీ ఆస్తుల వికృతీకరణ నిరోధక చట్టంలోని పలు సెక్ష?న్ల కింద కమలా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని అన్నారు. పోలీసు వాహనంపై అభ్యంతరకర రాతలను చూపిస్తున్న అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయినట్లు పోలీసులు ఆరోపించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది. ఢిల్లీ పరిధిలో వర్తించే ఈ చట్టం ప్రకారం.. బహిరంగంగా కనిపించే ఆస్తులపై అనుమతి లేకుండా రాతలు, గుర్తులు వేయడం నేరం. నేరానికి పాల్పడిన వారికి గరిష్ఠంగా ఏడాది జైలు శిక్ష లేదా రూ.50 వేల జరిమానా లేదా రెండూ విధించవచ్చు.




### ఆర్టీఐ చట్టం పేరుతో ప్రభుత్వ యంత్రాంగాన్ని వేధిస్తే సహించేది లేదు!

- ఒకే తరహా దరఖాస్తులతో అధికారుల సమయాన్ని, ప్రభుత్వ వనరులను వృథా చేయడం ప్రజాస్వామ్య హక్కు కాదు
- రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్.నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి : సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన ప్రజాస్వామ్య ఆయుధం... ప్రభుత్వ అధికారులను వేధించే అస్త్రం కాదు! ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన ఈ చట్టాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు, ప్రభుత్వ యంత్రాంగంపై అనవసర ఒత్తిడి తెచ్చేందుకు, అధికారుల విధులకు

వివరాలు 4లో..



### రాష్ట్రానికి త్వరితగతిన కేంద్ర సాయం అందేలా చూడండి

- అర్నబ్ తుఫాను నష్టంపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు
- 4 జిల్లాల పర్యటన వివరాలు వెల్లడించిన కేంద్ర బృందం సభ్యులు
- రాష్ట్ర ప్రభుత్వ తక్షణ స్పందన, సహాయక-పునరుద్ధరణ చర్యలపై ప్రశంసలు

వివరాలు 4లో..

### మురసు తుపాను పట్ల అప్రమత్తతో వ్యవహరించండి




**నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపనున్న తుపాను**

- అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయండి
- లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- వాగులు, వంకల చెంతన జన సంచారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- తాగు నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా సమన్వయం చేసుకోవాలి
- మురసు తుపాను నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో ఉప ముఖ్యమంత్రివ పవన్ కళ్యాణ్ సమీక్ష

2 పేజీలో..

పోలీస్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. అవసరం ఉన్న చోట పునరావాస కేంద్రాల ఏర్పాట్లు, తాగునీరు, భారీ వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రోడ్లను తక్షణం పునరుద్ధరించడం, రోడ్లపై చెట్లు కూలితే తక్షణం తొలగించడం వంటి చర్యల్లో భాగస్వామ్యం కావాలని తెలిపారు. మురసు తుపాను ఈ రోజు తీరం తాకనుందన్న హెచ్చరికల నేపథ్యంలో తన పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావం ఉండనున్న జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు. మురసు తుపాను మొదట బాపట్ల, మచిలీపట్నం మధ్య తీరం తాకుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం తుపాను దిశ మార్చుకుని నెల్లూరుకు సమీపంగా తీరం దాటబోతోందని, తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, మార్కాపురం జిల్లాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు వివరించారు.

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోక ముందే మురసు రూపంలో మరో తుపాను ముప్పు రాష్ట్రానికి పొంచి ఉన్న నేపథ్యంలో విపత్తుని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్.డబ్ల్యూఎస్ సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, ఆయా జిల్లాల యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.



### ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆరుగురు మృతి, ఇద్దరికి గాయాలు**

కుషినగర్: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కుషినగర్‌లోని థరువా డిహ్ ప్రాం తం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఓమ్ని వ్యాన్, ట్రైలర్ లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉంది.

- మిగతా 2లో..

### మురసు తుపానుపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ

- కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- ఒంగోలు సమీపంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున తీరం దాటే అవకాశంద
- 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి..
- హోంమంత్రి అనిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తోందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వివరాలు 4లో..






### తగ్గిన చమురు ధరలు

**మార్కెట్లలో జోష్**

బిజినెస్ : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఇరాన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు చర్చలు జరుగుతున్నాయన్న వార్తలతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయి. దీంతో మదుపర్లలో విశ్వాసం పెరిగి మార్కెట్లలో కొనుగోళ్ల జోరు కనిపించింది. ఈ క్రమంలో ఒక దశలో బీఎస్ఈ సెన్సెక్స్ 1,000 పాయింట్లకు పైగా లాభపడింది. ఉదయం 10 గంటల సమయానికి సెన్సెక్స్ 943 పాయింట్లు పెరిగి 75,388 వద్ద కొనసాగింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 257 పాయింట్లు లాభపడి 23,305 వద్ద ట్రేడయింది.

2 లో..

### తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

**అమిత్ షా**



న్యూఢిల్లీ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌ను కాపాడలేరని అన్నారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

2 పేజీలో..

ప్రజాభూమి
మంగళవారం, నవంబర్ 3, 2026


## సంపాదకీయం

# నెట్టింట్లో దోపిడీ..!



ఒకప్పుడు దొంగ ఇంట్లోకి రావాలంటే తలుపులు బద్దలు కొట్టాలి. ఇప్పుడు అలాంటి అవసరమేమీ లేదు. మన ఇంటి చిరునామా కూడా తెలియని వ్యక్తి ఎక్కడో కూర్చొని ఒక ఫోన్‌కాల్‌తో మన జీవితంలోకి చొరబడతాడు. పోలీసు అధికారినని, ప్రభుత్వ సంస్థ నుంచి మాట్లాడుతున్నానని నమ్మిస్తాడు. మనల్ని భయపెట్టి, మన చేతులతోనే మన డబ్బును కాజేస్తాడు. చట్టం భ్రమలో పెట్టి, సాగించే ఈ ఆధునిక మోసానికి పెట్టిన పేరే 'డిజిటల్ అరెస్టు'. ఆధార్‌తో అక్రమ సిమ్ తీసుకున్నారని, మన పేరుతో వచ్చిన పార్శిల్‌లో మాదకద్రవ్యాలు ఉన్నాయని, బ్యాంకు ఖాతా ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగపడిందని బెదిరిస్తారు. పోలీసు యూనిఫాం, నకిలీ పత్రాలు, పోలీసు స్టేషన్ నేపథ్యంతో వీడియో కాల్‌లో కనిపించి నమ్మిస్తారు. విచారణ పేరుతో ఫోన్ కట్ చేయనివ్వరు. కుటుంబ సభ్యులతో మాట్లాడనివ్వరు. కేసు నుంచి బయటపడాలంటే డబ్బు బదిలీ చేయాలని ఆదేశిస్తారు. తాత్కాలిక ధ్రువీకరణ, ఆర్థిక లావాదేవీల పరిశీలన, సెక్యూరిటీ డిపాజిట్ అంటూ కొత్త కథలు అల్లుతారు. నిజానికి భారత చట్టాల్లో డిజిటల్ అరెస్టు అనే ప్రక్రియే లేదు. అయినా ఈ మోసాలు కొనసాగుతున్నాయి. ఇటువంటి మోసాల్లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడం వల్ల ఖాతాదారులు సొమ్ము కోల్పోతే, ఆ నష్టానికి తగిన పరిహారం చెల్లించేలా నిబంధనలు రూపొందించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆర్‌బిఐని ఆదేశించడం సరైనది. జాతీయ సైబర్ నేరాల నివేదికల పోర్టల్‌కు డిజిటల్ అరెస్టు మోసాలపై 2024లో 1,23,672 ఫిర్యాదులు అందాయి. ఈ ఏడాది జూన్ 30 నాటికి 16,377 ఫిర్యాదులు నమోదయ్యాయి. అన్ని రకాల ఆర్థిక సైబర్ మోసాలను కలిపి చూస్తే 2021 నుంచి 2025 వరకు 65.89 లక్షలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. బాధితులు కోల్పోయిన మొత్తం రూ.55 వేల కోట్లకు పైమాటే. ఈ నేరాల వెనుక పనిచేస్తున్నది ఒకరిద్దరు వ్యక్తులు కాదు. నకిలీ సిమ్‌కార్డులు, మ్యూల్ ఖాతాలు, నకిలీ గుర్తింపులు, సాంకేతిక సేవలు.. వీటన్నిటి నిర్వహణతో ఒక సమాంతర నేర వ్యవస్థే నడుస్తోంది. ఈ మోసాలకు సామాన్యులే కాదు, ఉన్నత విద్యావంతులు, ఉన్నత పదవుల్లో పనిచేసినవారూ బలవుతున్నారు. హైదరాబాద్‌లో 80 ఏళ్ల రిటైర్డు ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగిని బెంగళూరు పోలీసులమని, సీబీఐ అధికారులమని నమ్మించి రూ.1.14 కోట్లు కాజేశారు. పుణెలో ఒక రిటైర్డు న్యాయమూర్తిని ఐపీఎస్ అధికారినని చెప్పిన వ్యక్తి మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తానని బెదిరించి కోటి రూపాయలకు పైగా దోచుకున్నాడు. హైదరాబాద్‌లోనే 66 ఏళ్ల రిటైర్డు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌ను ఈడీ, ఎన్‌ఐఏ అధికారులమని నమ్మించి రూ.98,888 కాజేశారు. ఇటీవల అహ్మదాబాద్‌లో 83 ఏళ్ల రిటైర్డు నేవీ అధికారిని సీబీఐ అధికారులమని నమ్మించి రూ.42.5 లక్షలు దోచుకున్నారు. నేరస్తులు సీనియర్ సిటిజన్లనే లక్ష్యంగా చేసుకోవటం ఒక వ్యూహం! వారి వద్ద జీవితకాలపు పొదుపు, పెన్షన్, బ్యాంకు డిపాజిట్లు ఉంటాయి. అదే సమయంలో సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. పోలీసు, కోర్టు, సీబీఐ పేర్లు వినగానే భయపడతారు. పిల్లలు దూర ప్రాంతాల్లో ఉండటం, ఒంటరితనం, కుటుంబానికి చెడ్డపేరు వస్తుందనే ఆందోళన కూడా వారిని బలహీనపరుస్తాయి. ఈ మానసిక స్థితిని నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. అయితే మన వివరాలు, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, కుటుంబ సభ్యులు, ఉద్యోగం, ఆర్థిక లావాదేవీల వంటి సమాచారం నేరగాళ్లకు ఎలా అందుతోంది? ఇది కీలకమైన ప్రశ్న. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రులు, బీమా సంస్థలు, విద్యాసంస్థలు, ఆన్‌లైన్ వేదికలకు మనం సమర్పించే వివరాలు భద్రంగా ఉండటం లేదు. ప్రజల డేటా సరుకుగా, వనరుగా మారుతోంది. మనం ఏ వస్తువు కొంటున్నాం, ఏ ఆసుపత్రికి వెళుతున్నాం, ఎక్కడ నివసిస్తున్నాం, ఏ అంశాలపై ఆసక్తి చూపిస్తున్నాం వంటి వివరాలు డిజిటల్ ప్రపంచంలో నిరంతరం నమోదవుతున్నాయి. ఇంటర్నెట్‌లో మనం వదిలే ప్రతి వివరం మన వ్యక్తిగత జీవితంపై ఒక సమాచార పత్రాన్ని తయారుచేస్తోంది. అది వాణిజ్య సంస్థలకు చేరి, మనల్ని వినిమయ ప్రపంచంలోకి లాక్కెళుతుంది. నేరగాళ్లకు చేరి, మోసాలకు ఎరగా మారుస్తోంది. భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) గణాంకాల ప్రకారం 2021లో 14,02,809 సైబర్ నేరాలు నమోదు కాగా, 2025లో ఆ సంఖ్య 29,44,248కు చేరింది. నాలుగేళ్లలో రెట్టింపునకు పైగా పెరిగిన ఈ సంఖ్య డిజిటల్ మోసాల తీవ్రతకు సూచిక. వ్యక్తిగత గోప్యత విషయంలో ప్రభుత్వ అధికారానికీ హద్దులు ఉండాలి. 2017లో సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం కె.ఎస్. పుట్టస్వామి కేసులో వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అది రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రసాదించే జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగమని స్పష్టం చేసింది. ప్రజల సమాచారాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే దానిని అనవసరంగా సేకరించినా, దుర్వినియోగపరిచినా అది కూడా గోప్యతా హక్కుకు భంగమే అవుతుంది. డిజిటల్ మోసగాళ్లను అడ్డుకోవడంతోపాటు పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి అనధికారంగా చొరబడే వ్యవస్థలను నియంత్రించాలి. మన సమాచారంపై మనకే హక్కు ఉండాలి. ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలది, సమాచారాన్ని సేకరించే సంస్థలది. మనకు కావలసింది కేవలం డిజిటల్ ఇండియా కాదు.. భద్రమైన డిజిటల్ ఇండియా!

# తగ్గిన చమురు ధరలు

నిఫ్టీలో రిలయన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టాటా స్టీల్, జియో ఫైనాన్షియల్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాలు నమోదు చేయగా, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్స్, ఐషర్ మోటార్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ షేర్లు నష్టాల్లో కొనసాగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.97 వద్ద ప్రారంభమైంది. మార్కెట్ల ర్యాలీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించిన మెరుగైన త్రైమాసిక ఫలితాలు కూడా తోడయ్యాయి. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ రూ.29,550 కోట్ల రికార్డు నికర లాభాన్ని ప్రకటించింది. దీంతో రిలయన్స్ షేరు విలువ 6 శాతానికి పైగా పెరిగింది. ఇతర కంపెనీల నుంచి వచ్చిన సానుకూల ఫలితాలు కూడా సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి. మరోవైపు గత వారం బ్యారెల్ ముడి చమురు ధర 118 డాలర్ల ఆరు నెలల గరిష్ఠానికి చేరగా, తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర 110 డాలర్ల దిగువకు పడిపోయింది. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల తగ్గుదల దేశీయ మార్కెట్లకు కలిసొచ్చాయి.

# తీవ్రత తక్కువే..అయినా అప్రమత్తత ముఖ్యం

అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అధికారులు అంచనా వేశారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉందని, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్‌లోని జలాశయాల్లో నీటిని నిల్వ చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మార్కాపురంలోని కంభం చెరువుతో పాటు ఆయా జిల్లాల్లోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలను కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

**చెరువులకు గండ్లు పడకుండా చర్యలు :** మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**ప్రతి రెండు గంటలకు బులెటిన్ :** వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓసారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడి ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా హాజరయ్యారు.

# రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి

కోయడం అత్యంత హేయమని ఆయన ఆక్షేపించారు. చివరకు స్కూళ్లలో కూడా పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో ఉన్మాది చేతిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టెన్త్ విద్యార్థిని గోపికను వైయస్ జగన్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడిన ఆయన బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. పాప ఆరోగ్యం కాస్త మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పడం, కాస్త సంతోషించతగిన విషయమని, బాలిక పరామర్శ అనంతరం ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడిన శ్రీ వైయస్ జగన్ అన్నారు.

**ఈ సందర్భంగా శ్రీ వైయస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..**

పాఠశాలతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తి ఏకంగా విద్యుత్ రంపం తీసుకుని హైస్కూల్‌లోకి ప్రవేశించి, బాలికలపై దాడి చేసే పరిస్థితి నెలకొంటే, ఇక స్కూళ్లలో చదువుకునే పిల్లల భద్రత ఏమిటి? అసలు పాఠశాలలోకి ఒక వ్యక్తి విద్యుత్ రంపంతో వస్తుంటే అడ్డుకునేవారే లేకపోవడం అత్యంత దారుణం. రాష్ట్రంలో ఇలాంటి దారుణ పరిస్థితులు నెలకొనడానికి ప్రధాన కారణం వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ వైఫల్యమే. ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా విస్తరిస్తున్నాయి. గంజాయి, మద్యం అందుబాటులోకి రావడంతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ పరిస్థితుల వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని నియంత్రించలేకపోతున్నందుకు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఒక అమాయక బాలిక నేడు చావుబతుకుల మధ్య పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలోకి బయటి వ్యక్తి ప్రవేశించి, విద్యుత్ రంపంతో దాడి చేసినా అడ్డుకోలేని దుస్థితి నెలకొంది. ఈ ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఆ దిశలో బాధిత బాలిక



కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల పరిహారం అందించాలి. అంతే కాకుండా బాలికకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో అందించాలి. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలి.

ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆ కుటుంబానికి అండగా నిలుస్తుంది. బాలిక వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తుంది. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం ఇవ్వకపోతే, వైయస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ కుటుంబానికి రూ.50 లక్షలు అందిస్తాం. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, శాంతిభద్రతలను పూర్తిగా గాలికొదిలేశారు. పోలీసుల దృష్టి శాంతిభద్రతల పరిరక్షణపై కాకుండా రాజకీయ వ్యవహారాలపై ఉండే పరిస్థితి తీసుకొచ్చారు. అందుకే రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయి.ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే గత 15--16 నెలల్లో తొమ్మిది దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. వాటిలో ఆరు ఘటనలు మహిళలు, బాలికలకు సంబంధించినవే కావడం ఆందోళనకరం. ఇప్పుడు గోపిక అనే చిన్నారిపై జరిగిన దాడితో పాటు, అనూష, సావిత్రిబాయి, సావిత్రమ్మలకు సంబంధించిన ఘటనలు. 14 ఏళ్ల ఎస్సీ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం. కురువ లింగయ్య హత్య. బోయ నాగేష్ హత్య. నారాయణరెడ్డి హత్య. స్పందన అనే యువతి ఆత్మహత్య వంటి ఘటనలు రాప్తాడులో చోటుచేసుకున్నాయి. ఒక్క నియోజకవర్గంలోనే ఇన్ని ఘటనలు జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి గ్రామంలో గంజాయి, మద్యం విచ్చలవిడిగా విస్తరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మరోవైపు రెడ్‌బుక్ పాలన పేరుతో పోలీసు వ్యవస్థను రాజకీయ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఫలితంగా పోలీసులు శాంతిభద్రతలపై దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల ప్రాణాలకు, ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు రక్షణ లేకుండా పోతోంది.

ఈ దారుణ ఘటనలో తీవ్రంగా గాయపడిన గోపిక ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దేవుడి దయవల్ల చిన్నారి ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు చెబుతున్నారు. దాదాపు 11 గంటల పాటు సాగిన అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను చిన్నారి తట్టుకుంది. మరో 48 గంటల పాటు పరిస్థితి విషమంగానే ఉంటుందని వైద్యులు చెబుతున్నప్పటికీ, చికిత్సకు బాగా స్పందిస్తూ కోలుకుంటోందని వివరించారు. ఒకవైపు చిన్నారికి జరిగిన దారుణాన్ని తలచుకుంటే తీవ్ర ఆవేదన కలుగుతోంది. మరోవైపు ఆమె ఆరోగ్యం మెరుగుపడుతోందన్న సమాచారం కొంత సంతోషాన్ని కలిగిస్తోందన్న వైయస్ జగన్, ఆ పాప పూర్తిగా కోలుకుని క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

# మురసు తుపాను పట్ల అప్రమత్తతో వ్యవహరించండి

వాతావరణ శాఖ అంచనాల మేరకు ఈ మధ్యాహ్నం తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు. తీరాన్ని తాకే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అత్యంత భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. అర్నబ్ తుపాను మాదిరి మురసు తుపానును కూడా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖలతో కలసి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చే హెచ్చరికల ఆధారంగా గ్రామాల్లో ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. గ్రామాలకు సమీపంలో ఉండే వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, ఉధృతంగా ప్రవహించే వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గిన వెంటనే బ్లీచింగ్, క్లోరినేషన్ చేసేందుకు వీలుగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి నిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు పెద్ద ఎత్తున నేలకొరిగే అవకాశాలు ఉన్న క్రమంలో నష్టం జరిగిన తర్వాత వీలైనంత త్వరగా పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బందికి సూచనలు చేశారు. వర్షాలకు రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కొట్టుకుపోయినా వెంటనే స్పందించాలని, ప్రమాదకరమైన రహదారులు, లోలెవల్ కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. తీర ప్రాంత మత్స్యకారులు సముద్రంలో తుపాను తాలూకు అలజడి పూర్తిగా తగ్గి, అధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని, తీర ప్రాంత ప్రజలు బీచ్‌ల వద్దకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. తుపాను సమయంలో అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. పంటల నష్టం తగ్గించేలా రైతులకు ముందస్తు సూచనలు చేయాలని, భారీ వర్షాల కారణంగా పంటలు నీట మునిగిన చోట, వర్షపు నీటిని వెంటనే



మళ్లించే ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వం నుంచి వచ్చే హెచ్చరికలు పాటిస్తూ, యంత్రాంగానికి సహకరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని పవన్ కళ్యాణ్ కోరారు.

# తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

**» తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ » 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య**

**» ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ » ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా » తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా**

హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. 'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు బీజేపీ ఇచ్చిన ప్రతివ్యూహంలో భాగంగా జరిగింది.

ఈవీఎంలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా స్పందించారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో అక్రమాలు



జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలయ్యాయని పేర్కొంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.

దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అంతకుముందు సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహా పలువురు పార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావుతో పాటు ఎంపీ రఘునందన్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌కు చేరుకున్న అమిత్ షా అక్కడ భోజన విరామం తీసుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో పాటు పలువురు ప్రముఖులతోనూ సమావేశమయ్యారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్రలో కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ పాదయాత్రకు 'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకవాదాన్ని అంతం చేద్దాం) అనే పేరు పెట్టింది. ఢిల్లీలో నిన్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా, ఎస్ఐఆర్‌పై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ నేతలు ప్రకటించారు. హైదరాబాద్ పాదయాత్రతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ప్రణాళిక రూపొందించింది.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
మంగళవారం, నవంబర్ 02, 2026


# మోపిదేవిలో హోరెత్తిన కూటమి ప్రచారం





**❖ కూటమి ప్రచారానికి ప్రజల నుంచి అనుహ్య స్పందన ❖ మోపిదేవి మండల కూటమి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులతో కలిసి ప్రచారం చేసిన విక్కుర్తి ❖ అవనిగడ్డ నియోజక వర్గంలోని కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్న విక్కుర్తి**

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

నవంబర్ 5వ తేదీ గురువారం రోజున జరగనున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మోపిదేవిలో నిర్వహించిన ప్రచారం హోరెత్తింది. తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ విక్కుర్తి వెంకట శ్రీనివాస రావు కూటమి అభ్యర్థులతో కలిసి మోపిదేవి ప్రధాన సెంటర్లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు.కూటమి బలపరిచిన జడ్పిటిసి అభ్యర్థి మురాల సీతమ్మ, మోపిదేవి - 1 సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి నందిగం శంకరరావు లతో పాటు మండలంలో కూటమి తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులతో కలిసి విక్కుర్తి సోమవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. కూటమి అభ్యర్థులను ఏకపక్షంగా గెలిపించు కుంటామంటూ పలువురు విక్కుర్తి తో చెప్పారు.మోపిదేవిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ మీదగా రావివారిపాలెం రోడ్డులో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, బస్టాండ్ సెంటర్, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా గల దుకాణాలలో విక్కుర్తి ప్రచారం చేశారు. కూటమి పార్టీల శ్రేణులు జండాలు చేతపట్టి, హుషారుగా ప్రచారంలో ముందంజలో నిలిచారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ ల సారధ్యంలో భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుందన్నారు. వీళ్ళ సారధ్యంలో మరో 15 సంవత్సరాల పాటు కూటమి అధికారంలో ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారతదేశంలోని అగ్రగామిగా నిలుస్తుందన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిని అలాగే సంక్షేమ పథకాల అమలును చూసి కూటమి అభ్యర్థులను ఏకపక్షంగా గెలిపించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరూ తమకు గల రెండు ఓట్లను సైకిల్, గాజు గ్లాసు, కమలం గుర్తులపై వేయాలని కోరారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, మాజీ సిడిసి చైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, మాజీ జడ్పిటిసి సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్న గోపాల్ లతో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## హుస్సేన్‌పాలెంలో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం


ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

హుస్సేన్‌పాలెం గ్రామంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, కూటమి నాయకులు పాల్గొని ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు సాగిస్తున్నారు.కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా గ్రామంలోని ప్రజలతో మమేకమవుతూ, కూటమి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర పర్యటనతో గ్రామంలో ఎన్నికల ప్రచార వాతావరణంలో మరింత ఉత్సాహంగా నెలకొంది. కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## తిరువణ్ణామలై(అరుణాచలం) ''కార్తీగై మహా దీపోత్సవం'' కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః కార్తీక మాసంలో వచ్చే కృత్తికా నక్షత్రం, కార్తీక పౌర్ణమి (24.11.2026) తిథి కలయికలో తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం సందు అత్యంత భక్తి శ్రద్ధలతో "కార్తీగై మహా దీపోత్సవం" నవంబర్ నెల 12వ తారీఖు నుండి 28వ తారీఖు వరకు నిర్వహిస్తున్నందున ఏపిఎస్ ఆర్టీసి కృష్ణా జిల్లాలోని అన్ని డిపోల నుండి అరుణాచలంకు ది.22.11.2026 నుండి ది.24.11.2026 (కార్తీక పౌర్ణమి) వరకు భక్తుల కోరిక మేరకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయబడినవి. కార్తీక మాసంలో ది.24.11.2026 న జరిగే "అరుణాచలం కార్తిగై మహా దీపం" దర్శిస్తే ఎంతో పుణ్యం కలుగు తుం దని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టు కుని అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గనవరం మరియు ఉయ్యూరు డిపోల నుండి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు లను ఏర్పాటు చేయడ మయినది. ఈ కార్తీగై మహా దీపోత్సవానికి అరుణాచలం వెళ్లు ప్రయాణీకులు ముందస్తుగా ఆన్ లైన్ నందు కూ డా రిజర్వేషన్ చేసుకోవచ్చు. కార్తీక మాసం సంధర్భంగా కృష్ణా జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సులను ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన పంచారామాలకు ప్రతి శనివారం రాత్రి, ఆదివారం రాత్రి, అలాగే అరుణాచలం మరి యు విశిష్ట శైవ క్షేత్రాలకు ప్రత్యేక పలు పుణ్య క్షేత్రాలకు స్పెషల్ బస్సులు నడుపడానికి ఏపిఎస్ఆర్టీసీ, కృష్ణాజిల్లా వారు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా కృష్ణా జిల్లా పరిధిలోని అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం మరియు ఉయ్యూరు డిపోల నుండి కార్తీక మాసం లో "పంచారామాలు" దర్శనమునకు కూడా స్పెషల్ సర్వీసులు ఏర్పాటు చేయడమయినది. టికెట్లు బుక్ చేయదల చిన వారు సంబంధిత డిపో మేనేజర్లను అవనిగడ్డ - 9959225466, మచిలీపట్నం- 9959225462, గుడివాడ-9959225464, గన్నవరం-8790996090 మరియు ఉయ్యూరు-9959224796 ఫోన్ నంబర్లను సంప్రదించగలరు మరియు ముందస్తుగా ఆన్లైన్ లో కూడా రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కలదు. గ్రూపుగా వెళ్లే ప్రయాణీకులకు సంబంధిత డిపో మేనేజర్ లను సంప్రదిస్తే తమ ఊరి వద్దకే బస్సును పంపబడును. కావున భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని ఆర్టిసిని ఆదరించవలసినదిగా కోరుచున్నాము.గమనిక: ప్రయాణికులు బృందాలుగా విహార యాత్రలకు మరియు పుణ్య క్షేత్రాల దర్శనకు వెళ్లదలచుకుంటే అద్దె ప్రాతిపదికన వారు కోరిన విధంగా, కోరిన ప్రాంతాలకు ఏ.సి, స్టార్ లైనర్ (నాన్ ఎ.సి స్లీపర్), సూపర్ లగ్జరీ బస్సులను శబరిమలై, నాగపట్నం, నెల్లూరు దర్గా, అయోధ్య, వారణాసి వంటి దూరప్రాంతాలకు కూడా బస్సులు ఏర్పాటు చేయబడునని జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏపిఎస్ఆర్టీసి, కృష్ణా జిల్లా, మచిలీపట్నం తెలియజేశారు.



## తుఫాను ప్రభావిత గ్రామాల్లో కెయూ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం సముద్ర తీర ప్రాంతమైన మచిలీపట్నం పరిసర గ్రామాల మీద తీవ్ర ప్రభావం చూపిం చింది. అలా దెబ్బతిన్న గ్రామాలైన చిన్నా పురం, గుండుపాలెం, ఆర్. గొల్లపాలెం, కోన గ్రామాల్లో కృష్ణా యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కూన రాంజీ ఆదేశాలతో వర్సిటీ లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. వాలంటీర్లు ఆయా గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం, రోడ్లకు అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగించడం, గ్రామ స్తులతో తుఫాను అనంతర సమస్యల పై సర్వే నిర్వహించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్ని స్తామని విద్యార్థులు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలు వర్సిటీ లోని ఇంజనీరింగ్, ఫార్మసి కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు ఆర్. దుర్గాప్రసాద్, డా. పి.గోపి, డి. శాంతి కృప, కె. కవిత, డా. ఎ.శేషారెడ్డి ఎన్. రంగశ్రీ, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.



## పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఓటింగ్ సరళిని ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యావరణహితంగా, స్వచ్ఛమైన ఎన్నికల నిర్వహణ దిశగా కొత్త కాన్సెప్ట్‌తో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని తీర్చిదిద్దిన మొవ్వ ఎంపీడీవో టీమ్‌కు జిల్లా కలెక్టర్ అభినందించారు.

## వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా డ్రైనేజీల పూడికతీత పనులు చేపట్టాలి



జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

నగరంలో వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా, డ్రైనేజీల ద్వారా సాఫీగా ప్రవహించేలా పూడికతీత పనులను వేగవంతం చేయా లని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. సోమవారం మచిలీపట్నం నగరం 2, 3వ డివిజన్ల పరిధిలోని మార్కెట్ యార్డ్ రోడ్డు సమీపంలో డ్రైనేజీ పూడికతీత పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాను ప్రభావంతో డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించి నీటి పారుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

వర్షపు నీరు రోడ్లపై నిలవ కుండా, డ్రైనేజీల ద్వారా నిరంతరాయంగా ప్రవహించేలా చూడాలన్నారు. నగరంలోని కోనేరు సెంటర్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచే సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి, వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## నేడు అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మురసు తుపాను దబుష్ట్యా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నేడు అనగా మంగళవారం కాంపెన్సేటరీ సెలవు ప్రకటించినట్లు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని అందరు ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ సూచనలు తప్పనిసరిగా ఆచరించవలసిందిగా తెలియజేశారు. సదరు సెలవును తదుపరి ప్రభుత్వ సెలవు దినములలో పని చేయాలని తెలిపారు.



## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పూర్తి పారదర్శకత, కచ్చితత్వం పాటించాలి

**✠ కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదు ✠ కౌంటింగ్ అధికారులకు స్వయంగా శిక్షణ ఇచ్చి, సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, పూర్తి కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ కౌంటింగ్ అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి పొరపాట్లకు, అనుమానాలకు తావులేకుండా ఎన్నికల నిబం ధ నలు, మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి సోమవారం జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి, కౌంటింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ, ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం, పెడన లోని సెయింట్ విన్సెంట్ పల్లోట్టి హైస్కూల్‌లో ఈ శిక్షణ కార్య క్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు అనేది ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన దశ అని, ఈ బాధ్యతను నిర్వహించే ప్రతి అధికారి పూర్తి అప్రమత్తతతో, సంయమనంతో వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ సమయంలో అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు లెక్కింపు ప్రక్రియపై పూర్తి విశ్వాసం కలిగేలా అధికారులు తమ ప్రవర్తనను, విధి నిర్వహణను పారదర్శకంగా ఉంచుకోవాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రంలో అధికా రు లు వ్యవహరించాల్సిన తీరు, ఎదురయ్యే ప్రాక్టికల్ సమస్యలు, వాటిని పరిష్కరించుకునే విధానాలపై కలెక్టర్ స్వయంగా వివరిం చారు. ముఖ్యంగా కౌంటింగ్ హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచిన సూచన లు, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి అధికారి క్షు ణ్ణంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగానే విధులు నిర్వహించాలని ఆదేశించారు.

**ఓట్ల లెక్కింపులో పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు:-**

**ప్రతి ఓటును నిబంధనల ప్రకారం పరిశీలించి, చెల్లుబాటు అయ్యే ఓట్లను అభ్యర్థుల ఏజెంట్లకు స్పష్టంగా చూపించిన అనంతరం మాత్రమే లెక్కింపులోకి తీసుకోవాలి; లెక్కించిన ఓట్లను నిర్ణీత విధానం ప్రకారం 25 ఓట్ల చొప్పున కట్టలుగా ఏర్పాటు చేసి భద్రపరచాలి; చెల్లుబాటు అయ్యే, చెల్లుబాటు కాని ఓట్ల విషయంలో ఎన్నికల నిబంధనలను, హ్యాండ్‌బుక్‌లోని మార్గదర్శకాలను అనుసరించాలి; కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, అభ్యర్థులు, ఏజెంట్లకు ఎలాంటి సందేహాలు కలగకుండా పారదర్శకత పాటించాలి; ఏదైనా సందేహం లేదా సమస్య ఎదురైతే తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, సంబంధిత RO మార్గదర్శకత్వంలో నిబంధనల ప్రకారం పరిష్కరించుకోవాలి.**

కౌంటింగ్ ప్రక్రియలో వేగం కంటే కచ్చితత్వానికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు అలస్యమైనా ఫర్వాలేదు కానీ, ప్రతి ఓటును జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా లెక్కింపు పూర్తి చేయాలన్నారు. ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతను అత్యంత జవాబుదారీతనంతో నిర్వర్తించాలని, ఎన్నికల ఫలితాల విశ్వసనీయత కౌంటింగ్ సిబ్బంది పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.మచిలీపట్నం, ఉయ్యూరు, పెడన మూడు శిక్షణ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, కౌంటింగ్ సిబ్బందికి ఎదురయ్యే ప్రాక్టికల్ ఇబ్బందులను స్వయంగా తెలుసుకొని, వాటికి సులభమైన పరిష్కార మార్గాలను వివరించారు. కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన విధానాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ, సిబ్బందిలో ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన పని తీరును పెంపొందించేలా సూచనలు చేశారు.ఈ శిక్షణ కార్యక్రమాల్లో సంబంధిత రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు), మున్సిపల్ కమిషనర్లు, కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్ ప్రక్రియ

**✠ ఏ చిన్న సంఘటనకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తి ✠ విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు ✠ కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి**



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

కృష్ణా జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఏ చిన్న సంఘటనకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ముగిసింది. ప్రజలు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఎన్నికల విధులను సమ ర్థ వం తంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు సంబంధిత శాఖల అధికా రు లు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల విధు ల్లో అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ, ఎన్నికల నియమావళిని పాటిస్తూ పోలింగ్ ప్రశాం తంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, మెరైన్ నుండి ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమైన వారికి కృష్ణా జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో రానున్న కౌంటింగ్ ప్రక్రియను కూడా ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీస్ శాఖకు తమ సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఇదే కాకుండా రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు మరియు కౌంటింగ్, మూడు దశల్లో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు పోలింగ్, కౌంటింగ్ కు ఇదే విధంగా సహకరించాలని కోరారు.

## వాడపాలెం పంచాయతీ పరిధిలో కూటమి అభ్యర్థులకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః

మచిలీపట్నం రూరల్ మండలం వాడపాలెం పంచాయతీ పరిధిలోని చిన్నపుర వాడ పాలెం, వెంకట దుర్గాపురం, సత్యనారాయణపురం గ్రామాల్లో కూటమి బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా మచిలీపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివ రిస్తూ, మరింత అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

## జడ్పీటీసీ మరియు ఎంపీటీసీ అభ్యర్థులతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కోడూరు మండలం, లింగారెడ్డిపాలెం సెగ్మెంట్ పరిధిలోని జరుగువానిపాలెం గ్రామం నందు కోడూరు మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యరిని కోటా రామసుధ మరియు లింగారెడ్డిపాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిని దాసరి సుజాత ని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారంలో ప్రచారంలో పాల్గొని ప్రతి గడపకు వెళ్లి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు.

ఈ కార్యక్రమంలో కోడూరు మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల్లోని పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

మంగళవారం 3 నవంబర్ 2026




దసరా సందర్భంగా కనకదుర్గ అమ్మవారి

## ఆలయంలో అన్నదానం ప్రారంభం

ప్రజాభూమి ఏలూరు

దసరా సందర్భంగా ఏలూరు టెనర్జీపేట రెడీమేడ్ మరియు పాత కలప సెంటర్‌లో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), కూటమి మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి,నాయకులు ఆర్నెపల్లి తిరుపతి,జాలా బాలాజీ,ఎస్. ఆర్.కె. రాజు, శ్రీశ్రీశ్రీ రెడీమేడ్ యూనియన్ సభ్యులు,ఎస్. బ్రహ్మానందం,మధు పాల్గొన్నారు.

## ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

- రెడ్డి అప్పలనాయుడు



ప్రజాభూమి ఏలూరు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏలూరు నగర మేయర్ అభ్యర్థి, జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు.ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 1న జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమికి మద్దతుగా నిలిచిన ప్రజలకు,నాయకులకు, కార్యకర్తలకు,మీడియా మిత్రులకు,పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఏలూరులో 2,37,256 ఓట్లకు గాను 1,41,506 ఓట్లు పోలయ్యాయని, దాదాపు 60 శాతం మాత్రమే పోలింగ్ నమోదైందన్నారు.తక్కువ పోలింగ్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూ ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన పెంచాలని,యువత భవిష్యత్తుకు,రాష్ట్ర అభివృద్ధికి ఓటు బలమైన పునాది అని పేర్కొన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ,పోలీసు శాఖ,జిల్లా యంత్రాంగం,కూటమి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జనసేన నాయకులు నారా శేషు,రాఘవయ్య చౌదరి,శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, వీరంకి పండు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డి.ఎస్.పి రవిచంద్ర



ప్రజా భూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

స్థానిక సంస్థలు ఎన్నికల సందర్భంగా పోలవరం డివిస్పి రవిచంద్ర, జీలుగుమిల్లి సిఐ యాదగిరి, ఎస్ఐ వి విక్రాంత్ కుమార్ జీలుగుమిల్లి మండలంలో గల సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించు సందర్భంగా దర్భ గూడెం లో గల సెంట్ పీటర్ అండ్ పౌల్ స్కూల్ లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెదవేగి మండలంలో చింతమనేని నవ్యశ్రీ

## విస్తృత స్థాయి ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి దెందులూరు



ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో పెదవేగి జెడ్పీటీసీ సభ్యురాలు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని నవ్యశ్రీ కూటమి ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి విస్తృత స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థుల తరఫున ఓట్లు అభ్యర్థించారు.ఈ నెల 5వ తేదీన జరగనున్న ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా తమ గ్రామాలకు విచ్చేసిన చింతమనేని నవ్యశ్రీకి స్థానిక కూటమి నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెదవేగి మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా కొఠారు అబ్బయ్య చౌదరి విస్తృత ప్రచారం

ప్రజాభూమి దెందులూరు

పెదవేగి మండలంలోని సూర్యారావుపేట, గార్లమడుగు, లక్ష్మీపురం, పెదవేగి గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా దెందులూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు, నాయకులు,కార్యకర్తలతో కలిసి పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా గ్రామాల్లోని వివిధ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. నవంబర్ 5న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.గార్లమడుగు గ్రామం నుంచి జజ్జువరపు నాగరాజు, లక్ష్మీపురం గ్రామం నుంచి మేక దివ్యశ్రీ, పెదవేగి గ్రామం నుంచి పొన్నూరు విజయలక్ష్మి ఎంపీటీసీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రజల ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో ప్రజల నుంచి స్పందన లభించిందని, పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార



కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీఐ చట్టం పేరుతో ప్రభుత్వ యంత్రాంగాన్ని వేధిస్తే సహించేది లేదు!

- ఒకే తరహా దరఖాస్తులతో అధికారుల సమయాన్ని, ప్రభుత్వ వనరులను వృధా చేయడం ప్రజాస్వామ్య హక్కు కాదు
- రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి

సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన ప్రజాస్వామ్య ఆయుధం... ప్రభుత్వ అధికారులను వేధించే అస్త్రం కాదు! ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన ఈ చట్టాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు, ప్రభుత్వ యంత్రాంగంపై అనవసర ఒత్తిడి తెచ్చేందుకు, అధికారుల విధులకు ఆటంకం కలిగించేందుకు ఉపయోగిస్తే ఉపేక్షించేది లేదు. సమాచార హక్కు చట్టం దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది అని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు స్పష్టం చేశారు. ఎస్. ముద్దు కొండయ్య దాఖలు చేసిన రెండవ అప్పీల్ నం. 11323 /2023 మరియు బ్యాచ్‌లోని ఎనిమిది రెండవ అప్పీళ్లను విచారించిన అనంతరం, 14-10-2026న రాష్ట్ర సమాచార కమిషన్ ఉమ్మడి ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే తరహా ప్రశ్నావళితో వివిధ గ్రామాలు, మండలాలు, ప్రభుత్వ కార్యాలయాలకు పదేపదే సమాచార దరఖాస్తులు సమర్పించడం, వాటిపై వరుసగా అప్పీళ్లు దాఖలు చేయడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలపై అనవసరమైన పరిపాలనా భారం పడే పరిస్థితులను కమిషన్ తీవ్రంగా పరిగణించింది. సంబంధిత ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తమ వ్రాతపూర్వక సమర్పణలు, సమాచార సరఫరా వివరాలు, ఇతర రికార్డులను కమిషన్ ముందు సమర్పించారు. విచారణకు నోటీసులు అందినప్పటికీ అప్పీలుదారుడు విచారణకు గైర్హాజరైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ గ్రామాలు, మండలాలకు సంబంధించిన పేర్లు, వివరాలను మాత్రమే మార్చి దాదాపు ఒకే తరహా ప్రశ్నావళితో అనేక దరఖాస్తులు సమర్పించినట్లు అధికారులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వి.ఆదిత్య బందోపాధ్యాయ (2011) 8 ఎస్‌సీసీ497 తీర్పులో చేసిన కీలక వ్యాఖ్యలను కమిషన్ ప్రస్తావించింది. సమాచార హక్కు చట్టం నిజాయితీగా విధులు నిర్వహించే అధికారుల సాధారణ పనితీరుకు ఆటంకం కలిగించే విధంగా మారకూడదనే న్యాయసూత్రాన్ని గుర్తుచేసింది. సమాచార హక్కు చట్టం పౌరులకు కల్పించిన హక్కును ఎవరూ నిరాకరించలేరని, అయితే ఆ హక్కును చట్టం యొక్క ప్రధాన లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని కమిషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో, ఇప్పటికే పరిశీలించి పరిష్కరించిన లేదా గణనీయంగా సారూప్యత కలిగిన అంశాలపై మళ్లీ మళ్లీ సమాచార దరఖాస్తులు, మొదటి అప్పీళ్లు, రెండవ అప్పీళ్లు, ఫిర్యాదులు దాఖలు చేయకుండా అప్పీలుదారుడిని కమిషన్ తన ఉత్తర్వుల ద్వారా నిషేధించింది. ఈ విధానాన్ని కొనసాగిస్తే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అంతేకాకుండా, ఈ ఉత్తర్వుల ప్రతులను సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో "MISUSE OF RTI" శీర్షిక కింద ఉంచాలని ఆదేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు, నోడల్ అధికారులకు ఉత్తర్వుల ప్రతులను పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ రిజిస్ట్రీని ఆదేశించింది. ప్రజలకు సమాచారం అందించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ అధికారుల సమయం, వనరులు ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించబడేలా చూడటం కూడా అత్యంత అవసరం. సమాచార హక్కును పరిరక్షిస్తూనే దాని దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర సమాచార కమిషన్ కట్టుబడి ఉందని ఈ ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి.

# మురసు తుపానుపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ

- కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- ఒంగోలు సమీపంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున తీరం దాటే అవకాశం
- 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి..
- హోంమంత్రి అనిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తోందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ రాత్రి , రేపు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించిన నేపథ్యంలో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల కలెక్టర్లు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**విద్యుత్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి**

బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ముందుగానే వాటిని తొలగించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా, మొబైల్ నెట్‌వర్క్ సేవల్లో అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెగిపడిన వైర్లను తాకకుండా దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపించినా, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

**మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి**

తుపాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులను ముందుగానే అప్రమత్తం చేయాలని మంత్రి ఆదేశించారు. సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయడంతోపాటు, ఇప్పటికే ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని, అవసరమైన చోట్ల సహాయక చర్యలకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు.

**48 గంటల పాటు హై అలర్ట్**

రానున్న 48 గంటల పాటు అధికార యంత్రాంగం హై అలర్ట్‌లో ఉండాలని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని



సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించాలని అధికారులను ఆదేశించారు.

**అధికారిక హెచ్చరికలు పాటించాలి**

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సమన్వయంతో తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజలు అధికారికంగా జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే నిర్ధారణ లేని సమాచారాన్ని, వదంతులను నమ్మవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరారు. తుపాను సంబంధిత సమస్యలపై తక్షణ సహాయం కోసం మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. అత్యవసర సహాయం అవసరమైనవారు విపత్తుల నిర్వహణ సంస్థకు చెందిన 112, 1070, 18004250101 నంబర్లకు ఫోన్ చేయాలని హోంమంత్రి అనిత సూచించారు. ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యమని, తుపాను ప్రభావం తగ్గే వరకు అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని స్పష్టం చేశారు.

# రాష్ట్రానికి త్వరితగతిన కేంద్ర సాయం అందేలా చూడండి

- అర్నబ్ తుఫాను నష్టంపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు
- 4 జిల్లాల పర్యటన వివరాలు వెల్లడించిన కేంద్ర బృందం సభ్యులు
- రాష్ట్ర ప్రభుత్వ తక్షణ స్పందన, సహాయక-పునరుద్ధరణ చర్యలపై ప్రశంసలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి

అర్నబ్ తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం వాటిల్లడంతో, కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి వెల్లడించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, దీనికి సంబంధించిన నివేదికను ఇప్పటికే కేంద్రానికి సమర్పించామని చెప్పారు. తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. కేంద్ర హోం, వ్యవసాయం, జల వనరులు, జాతీయ రహదారులు, ఆర్థిక విభాగాలకు చెందిన అధికారులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదిక సమర్పించిన వెంటనే... నష్టం అంచనాకు కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించడంపై ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన సిఫార్సులు సమర్పించాలని కోరారు. కేంద్రం నుంచి సత్వర ఆర్థిక సాయం అందితే రాష్ట్రానికి ఎంతో ఊరట కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అర్నబ్ తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు కోనసీమ, పశ్చిమగోదావరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించిన విషయాన్ని కేంద్ర బృందం సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ జిల్లాల్లో తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు కేంద్ర బృందం అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను ప్రభావంతో వరి, కొబ్బరి, అరటి వంటి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు కేంద్ర బృందం గుర్తించింది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించింది. ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను తీవ్రత కారణంగా రైతులకు నష్టం మరింత పెరిగిందని బృందం సభ్యులు తెలిపారు.

**ఓవైపు కరువు...మరోవైపు తుఫాన్లు**

వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన, ఆక్వా కల్చర్ వంటి వాణిజ్య పంటలు కూడా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. మత్స్యకారుల పడవలకు సైతం నష్టం వాటిల్లిందన్నారు. అర్నబ్ తుఫాను మిగిల్చిన నష్టం నుంచి ఇంకా కోలుకోకముందే మురసు తుఫాను రాష్ట్రాన్ని తాకుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. హుద్ హుద్, తిత్లీ, మోంథా వంటి తుఫాన్లు గతంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టాన్ని కలిగించాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఒక ప్రాంతం ఎల్‌నినో వల్ల తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటుండగా, మరో ప్రాంతం తుఫాన్ల ప్రభావానికి గురవుతోందన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకే ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నామని... అలాగే తుఫాన్లను ఎదుర్కొనేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నామని సీఎం చెప్పారు. రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంతో పాటు వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను అనుసంధానం చేయడం ద్వారా తుఫాను సమయంలో ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించగలిగామని ముఖ్యమంత్రి కేంద్ర బృందానికి వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆర్టీజీఎస్, వాట్సాప్ మనమిత్ర కీలకంగా వ్యవహరించాయని కేంద్ర బృందం అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాలకు కూడా సిఫార్సు చేస్తామని కేంద్ర బృందం తెలిపింది.

**పునరుద్ధరణ చర్యలపై నిరంతర పర్యవేక్షణ**

తుఫాను కారణంగా విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం 7 వేల మంది సిబ్బందితో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పునరావాసం, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులను ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు, సహాయక చర్యలు-పునరుద్ధరణ పనులకు చేసిన కృషిని కేంద్ర బృందం ప్రశంసించింది. ముఖ్యంగా విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంది. మారుమూల ప్రాంతాల్లో సైతం ఈ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించింది.

ప్రజాభూమి
కోనసీమ
5
మంగళవారం 3 నవంబర్ 2026

# పాలకొల్లులో వైసీపీకి మరో భారీ షాక్

- వడ్డీలంకలో దళిత, బిసి 25 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిక
- టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి నిమ్మల
- కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు.. మంత్రి నిమ్మల పనితీరుపై ఆకర్షితులై పార్టీలో చేరిక



ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో వరుసుగా నాయకులు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో టిడిపిలో చేరడంతో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం వడ్డీలంక గ్రామ 20 దళిత కుటుంబాలు ,మరో 5 బీసీ కుటుంబాలకు చెందిన వైసిపి గ్రామ అధ్యక్షుడు దానం నాగార్జున, వాలంటీర్లు చిల్లే రాజేంద్రప్రసాద్, కారిపల్లి దుర్గా శ్రీనివాస్, చింత భూలక్ష్మి రాజశేఖర్, తరపట్ల ప్రసాద్ తదితరులు వైసీపీకి మూకమ్మడిగా రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారిని అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్న తీరు తమను ఆకర్షించాయని పార్టీలో చేరిన దళిత వర్గీయులు తెలిపారు. ఈ కారణంగానే వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దళితుల పక్షపాతిగా తాను నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.160 కోట్లతో పాలకొల్లు నియోజకవర్గంలోని వివిధ దళితవాడల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో ఎస్సీ సబ్ ప్లాను కు రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు అన్నారు. పాలకొల్లులో రూ.3.50 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపాన్ని అత్యంత సుందరంగా నిర్మించిన ఘనత గత టీడీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ కళ్యాణ మండపానికి కనీస నిర్వహణ పనుల కోసం కూడా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని విమర్శించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళ్యాణ మండపాన్ని ఉచితంగా వినియోగించుకునేలా అన్ని మౌలిక సౌకర్యాలతో మరింత సుందరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్న వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఎస్సీలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చేపట్టిన తొలి కార్యక్రమాల్లో భాగంగా ఆర్యపేట దళిత గ్రామంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు స్లాబ్ నిర్మాణ పనుల్లో స్వయంగా శ్రమదానం చేసినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎండకు, వానకు తడుస్తూ ఉన్న అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు రక్షణగా స్లాబ్ నిర్మాణాలు చేపడుతున్నామని, ఈ పనులను దశలవారీగా పూర్తిచేస్తున్నామని వివరించారు. దళితుల గౌరవం, ఆత్మగౌరవం కాపాడటంతో పాటు వారి నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆ గ్రామానికి చెందిన టిడిపి యలమంచిలి మండల నాయకుడు కడలి గోపాలరావు, అడ్డాల శ్రీనివాస్, జక్కంపూడి వెంకటరావు, శీలం రామకృష్ణ, రేఖపల్లి వెంకట రామారావు, గంట వెంకటేశ్వరరావు, తరపట్ల రవి తదితరులు నాయకత్వం వహించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో
## ప్రాహిబిషన్, ఎక్సైజ్‌షేషన్, పాలకొల్లు సర్కిల్ ఆధ్వర్యంలో తనిఖీలు

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు సర్కిల్ పరిధిలోని దిగమర్రు జంక్షన్ వద్ద ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది.ఈ తనిఖీలలో భాగంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయడం, అక్రమ నగదు, మద్యం మరియు ఇతర ప్రలోభాలకు సంబంధించిన వస్తువుల తరలింపును అరికట్టడం లక్ష్యంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా ప్రాహిబిషన్ డ ఎక్సైజ్ స్టేషన్ పాలకొల్లు తరఫున నిరంతరం నిఘా మరియు తనిఖీలుకొనసాగించబతాయని ఎక్సైజ్ సి ఐ మద్ది రామశేషయ్య తెలిపారు.

## పాలకొల్లు పురపాలక సంఘం వార్డు రిజర్వేషన్లు ఇవే

- మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ వెల్లడి



ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పురపాలక సంఘం పరిధిలోని 44 వార్డులకు సంబందించిన రిజర్వేషన్లు వివరాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆమోదం పొంది వచ్చిన వివరాలను మున్సి పల్ కమిషనర్ డి కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు . ఎస్టి జనరల్ కు 12 వ వార్డు కేటాయించినట్లు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి 7 వార్డులు కేటాయించగా అందులో మహిళలకు 11, 27,32 వార్డులు, జనరల్ కు 10, 13, 16,18 వార్డులు కేటాయించినట్లు తెలిపారు. బీసీలకు 14 వార్డులు కేటాయించగా మహిళలకు 3,8, 26, 30,31, 35, 42, అందులో జనరల్ కు 1, 5, 28, 33,40, 41, 44 వార్డులు కేటాయించారు. ఉమెన్ జనరల్ కు 12 వార్డుల్లో రెండు, ఆరు,ఏడు,20, 22, 23, 24, 29, 36, 38,39, 43 వార్డులు అన్ రిజర్వ్ వార్డులు పదిలో నాలుగు తొమ్మిది 14,15, 17, 19, 21, 25,34, 37 వార్డు ఉన్నాయని కమిషనర్ కిరణ్ కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోనసీమ జడ్పీ పీఠం గొల్లపల్లి అమూల్యకే దాదాపు ఖరారు!



ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠం గొల్లపల్లి అమూల్యకే దాదాపు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఆమె మామిడికుదురు జడ్పీటీసీ స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి సంబంధించి పార్టీ అధిష్ఠానం పలువురి పేర్లను పరిశీలించినప్పటికీ, చివరకు గొల్లపల్లి అమూల్య వైపే మొగ్గు చూపినట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ నడుస్తోంది. మామిడికుదురు జడ్పీ టీసీగా ఆమె విజయం సాధించడం లాంఛనమేనని, ఆ వెంటనే ఆమె జిల్లా పరిషత్ పగ్గాలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని నాయకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆమె అనుచరులు, పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

## ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు)కు సోమవారం ఆత్రేయపురం మండలంలోని టీటీడీ కల్యాణ మండపంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ పీవీఆర్‌కే రాజు, మండల విద్యాశాఖాధికారి పీవీ ప్రసాదరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియమితులైన మాస్టర్ ట్రైనర్లు పాల్గొని ఎన్నికల విధివిధానాలు, నియమ నిబంధనలు, పోలింగ్ ప్రక్రియపై పీఓలు, ఏపీఓలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, పోలింగ్‌కు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, బ్యాలెట్ పేపర్ల వినియోగం, ఓటరు గుర్తింపు, ఓటు వేసే విధానం, ఓటు గోప్యతను కాపాడటం, పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. అలాగే పోలింగ్ ప్రారంభానికి ముందు చేపట్టాల్సిన విధులు, మాక్ పోలింగ్



నిర్వహణ, వివిధ రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రిని నిబంధనల ప్రకారం ప్యాకింగ్ చేయడం, సీలింగ్ ప్రక్రియ, ఎన్నికల రికార్డులను సంబంధిత అధికారులకు అప్పగించే విధానంపై కూడా సిబ్బందికి శిక్షణ అందించారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులు సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపీటీసీ ఎన్నికల విధులకు నియమితులైన పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

## వేగేశ్వరపురంలో బీజేపీ అభ్యర్థి
## జయ వరలక్ష్మికి మద్దతుగా రాష్ట్ర నాయకుల ప్రచారం

- కమలం గుర్తుకే మన ఓటు అంటూ మార్మోగిన నినాదాలు



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ఎంపీటీసీ-2 బీజేపీ అభ్యర్థి ఇందుగుల జయ వరలక్ష్మి ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. బీజేపీ మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ సతీమణి అయిన జయ వరలక్ష్మికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ములా శ్రీనివాస మురళి అరవాల రావు దత్తు (బొమ్ముల దత్తు), పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు కాలేపు సత్య సాయిరాం, రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి బేతిరెడ్డి ఆదిత్య, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిపాటి స్వర్ణ రజనీ తదితరులు పాల్గొన్నారు. కూటమిలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొని, కమలం గుర్తుకే మన ఓటు.. ఇందుగుల జయ వరలక్ష్మికే మన ఓటు అంటూ నినాదాలు చేశారు. దీంతో వేగేశ్వరపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం సందడిగా సాగింది.

## ములగలమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి : మంత్రి పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి గ్రామదేవత శ్రీ ములగలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలంతా అమ్మవారి ఆశీస్సులతో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో మరింత ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు ధనలక్ష్మి, జోషిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జోరువానలోనూ ఆగని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి దెందులూరు



తుఫాను ప్రభావంతో జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ దెందు లూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన ఎన్నికల ప్రచా రాన్ని కొనసాగించారు.సోమవారం ఉదయం నుంచి దెందు లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ కూటమి అభ్యర్థుల తరఫున ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం భారీ వర్షం కురు స్తున్నా ప్రచార కార్యక్రమాన్ని ఆపకుండా ప్రజల మధ్యకు వెళ్లి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.ఈ సందర్భంగా టీడీపీ, బీజేపీ,జనసేన పార్టీలతో కూడిన కూటమి అభ్యరు లకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.వర్షాన్ని సై తం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ప్రచార కార్యక్రమంలో పాల్గొ నడంతో ఆయా గ్రామాల్లో కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.వివిధ గ్రామాల్లో ప్రచారం కొనసా గిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# నా కష్టాన్ని, శ్రమను గుర్తుంచుకోండి

- అడగకుండానే ద్వాక్రా భవనాలకు నిధులు ఇచ్చా ...
- మంత్రి నిమ్మలకు ద్వాక్రా మహిళల కృతజ్ఞతలు

ప్రజా భూమి ప్రతినిధి పాలకొల్లు



నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ద్వాక్రా భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు కావడంపై ద్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా యలమంచిలి మండలంలో మేడపాడు, ఆర్య పేట, మట్లపాలెం, కట్టు కాలువ, ఇలపకుర్రు , పాలకొల్లు మండలంలో చందపర్రు, ఆగరు, అగర్తిపాలెం, కొత్తపేట , చింతపర్రు, శివదేవుని చిక్కాల, బల్లిపాడు, లంకలకోడేరు, పోడూరు మండలంలో పెనుమదం, వేడంగి, పెనుమదం తదితర గ్రామాలకు చెందిన ద్వాక్రా మహిళలు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా గ్రామాల్లో మంత్రి పర్యటించిన సమయంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఆయనను కలిసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ద్వాక్రా భవనాలకు నిధులు మంజూరు చేయడం మీ వల్లే సాధ్యమైందని తెలిపారు. టిడిపి ప్రభుత్వం లో మంజూరైన నిధులు సరిపోక భవనాలు కొంతమేర నిర్మాణం జరిగి అసంపూర్తిగా నిలిచిపోయాయని, గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోకపోవడంతో మళ్లీ కూటమి ప్రభుత్వంలోనే కదలిక వచ్చిందని, భవనాలు పూర్తవుతాయని నమ్మకం కలిగిందంటూ ద్వాక్రా మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ద్వాక్రా మహిళలు అడగకుండానే వారి అవసరాలను గుర్తించి గత టిడిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 67 గ్రామాల్లో ద్వాక్రా భవన నిర్మాణాలకు నిధులు తీసుకురాగా కొంతమేర నిర్మాణం జరిగాయి అన్నారు. దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడంతో గత వైసిపి ఐదేళ్లలో రూపాయి ఖర్చు పెట్టకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి అన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేయగా రూ 4.40 కోట్లు మంజూరు అయిందని, త్వరలోనే పనులు మొదలు పెడతారన్నారు. ఇదే కాదు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు తాగునీటి సమస్యలను కూడా జలజీవన్ మిషన్ నిధుల ద్వారా దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. పాలకొల్లు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మంత్రి మహిళలకు వివరించారు. ఈ రెండేళ్లలో రూ 1245 కోట్లు పెద్ద ఎత్తున తీసుకువచ్చానని, నా కష్టాన్ని నా శ్రమను గుర్తుంచుకోవాలన్నారు. బీసీ, ఎస్సీలకు అధిక ప్రాధాన్యత పనిచేస్తున్నానని, గ్రామాల్లో పెద్ద ఎత్తున కమ్యూనిటీ హాల్ భావన నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి సంక్షేమంలో అగ్రగామిగా నిలిపేలా ఆదివారం లేదు, సెలవు లేదు, రాత్రింబవళ్లు ప్రతిక్షణం శ్రమిస్తున్నానన్నారు. భవిష్యత్తులో నూ ఇదే విధంగా పని చేస్తానన్నారు. మన గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, గత ఐదేళ్లు అభివృద్ధిని పట్టించుకోలేని వైసిపి నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి చెప్పే మాటలను నమ్మవద్దని, వాస్తవాలను గమనించాలని మంత్రి కోరారు.

## అల్లవరంలో కాంగ్రెస్ జడ్పీటీసీ అభ్యర్థి
## కుడిపూడి శ్రీనివాసరావు ముమ్మర ప్రచారం



ప్రజాభూమి ప్రతినిధి, అమలాపురం రూరల్

అల్లవరం మండలం కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి కుడిపూడి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తన గెలుపును కాంక్షిస్తూ మండల పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుంటూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్తూరు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, జిల్లా ఉపాధ్యక్షులు వాకపల్లి రాంబాబు, బీసీ నాయకులు రాయుడు వెంకటరమణ, మండల అధ్యక్షులు ఏలేశ్వరపు రాధాకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 03 నవంబరు 2026


## కేజీబీవీ విద్యార్థులకు దోమ తెరలు పంపిణీ..

ప్రజాభూమి యల్లనూరు



యల్లనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కేజీబీవీ స్కూల్ మరియు బీసీ హాస్టల్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ లోకేష్ కుమార్ 106 దోమ తెరలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం చలికాలం దోమల వల్ల వచ్చే మలేరియా డెంగ్యూ ప్రాణాంతక జ్వరాల బారిన పడినప్పుడు 15 రోజుల పాటు పిల్లలు స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లలేక పోతారు దీనివల్ల వారు చదువులో వెనుకబడడంతో పాటు పరీక్షల సమయంలో తీవ్రంగా నష్టపోతారు ఆరోగ్యం ఉంటేనే చదువుపై దృష్టి పెట్టగలరు ముఖ్యంగా పేద కుటుంబాల్లో అనారోగ్యం వస్తే ఆసుపత్రి ఖర్చులు భరించడం చాలా కష్టం అందుకనే ప్రభుత్వం వారు పేద విద్యార్థులకు ఉచితంగా దోమ తెరలను అందించడం వల్ల వ్యాధులు రాకుండా ముందే అరికట్టవచ్చు ఇది ఆయా కుటుంబాల పై పడే పిల్లల వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి ఉపయోగపడతాయి మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి కాచి చల్లార్చిన నీరు త్రాగాలని విద్యార్థులకు డా"లోకేష్ కుమార్ సూచించారు ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఎ, నాగేశ్వర్ రెడ్డి ఎం పి హెచ్ ఎస్, ఎన్ .హోజీవలి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మధు కుమార్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వైద్యాధికారి తెలిపారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ ను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం నగరంలోని ఎస్ ఎస్ బి ఎన్ కళాశాలలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు



తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి సీసీటీవీ ల ద్వారా క్షేత్రస్థాయిలో ఆయా స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను జా యింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడు తూ రేపటి రోజున జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలో సమయ పాలన, సమన్వయంతో పారదర్శకంగా విధులను సమర్ధవంతంగా పూర్తి చేయాలని ముఖ్యంగా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా సంబంధిత శాఖ అధికారులు అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అలాగే ఓట్ల లెక్కింపు సమయంలో బ్యాలెట్ బాక్సులను క్రమబద్ధంగా తరలించడానికి చర్యలు తీసుకోవాలని కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఉద్యోగ సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా జాగ్రత్తగా కౌంటింగ్ నిర్వహణ విధులను నిర్వర్తించాలని అలాగే పోలీసు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టిని సారించాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఓంకార్, మున్సిపల్ ఇంజనీర్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత తాడిపత్రి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్ ను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.

## రాజ్యోత్సవ కప్--2026 కరాటే పోటీల్లో పురం విద్యార్థుల ప్రతిభ

### -ఒక రజతం, 14 కాంస్య పతకాలతో సత్తా

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రాష్ట్రంలోని చిక్కబళ్లాపూర్‌లో నవంబర్ 1న నిర్వహించిన 6వ చిక్కబళ్లాపూర్ ఓపెన్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరాటే మాస్టర్ ఎస్. ఫ్లైరోజ్ తెలిపారు. సోమవారం ఆయన ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో తన వద్ద శిక్షణ పొందుతున్న అభ్యర్థులు వివిధ విభాగాల్లో పోటీపడి మొత్తం 15 పతకాలు సాధించారని చెప్పారు. వీటిలో ఒక రజత పతకం, 14 కాంస్య పతకాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో హితేష్ రాజ్, నిశాంత్, గౌరవ్, షఫాన్, హేమాంశ్, నిత్యశ్రీ, యాసీన్ తాజ్, సింధు పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో తాను, సెన్సై కె.ఎం. ఉసామా ఖాన్, నేహా రిఫరీలుగా పాల్గొని సేవలందించినట్లు వివరించారు. పోటీల నిర్వాహకులు క్యోషి ఎం. అల్తాఫ్ పాషా విజేత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయంపై కోచ్‌లు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసినట్లు ఫ్లైరోజ్ పేర్కొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటేయండి - ఇంటింటా ప్రచారం

### జడ్పిటిసి అభ్యర్థి మన్నల పెద్దిరాజు, ఎంపీటీసీ అభ్యర్థి మంజుల నెట్టికంటి

ప్రజా భూమి శింగనమల



మండలం చక్రాయపేట ఎంపీటీసీ పరిధిలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి మంజుల నెట్టికంటి తరఫున శింగనమల జడ్పీటీసీ మన్నల పెద్దిరాజు విస్తృతంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలియజేస్తూ, అభ్యర్థి మంజుల నెట్టికంటికి ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మేము చేసిన అభివృద్ధే మా గెలుపుకు బాట.. అభివృద్ధిని చూసి ఓటేయండి అని ప్రజలను కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

# కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్.. -నిబంధనలు అతిక్రమిస్తే వేటు

### • ఉదయం 7.45 గంటలకే ఏజెంట్లు హాజరు కావాలి • 8 గంటలకల్లా స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సుల తరలింపు • ఎనిమిది గదుల్లో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు • చైర్మన్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక హాల్ • పట్టణంలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7.45 గంటలకే కౌంటింగ్ ఏజెంట్లు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని, 8 గంటల లోపు స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను బయటకు తీసుకువచ్చి అనంతరం లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తామని మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరూ కౌంటింగ్ ప్రక్రియ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. హిందూపురం పురపాలక సంఘ రెండవ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సోమవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులతో కమిషనర్ మల్లికార్జున, హిందూపురం డీఎస్పీ రవిబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సమయపాలన, ఏజెంట్ల నియామకం, ఓట్ల లెక్కింపు విధానంపై కమిషనర్ వివరించారు. ఒక్కో కౌన్సిలర్ అభ్యర్థి తరఫున ఒక కౌంటింగ్ ఏజెంట్, ఒక రిలీవర్‌ను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించిందన్నారు. చైర్మన్ అభ్యర్థి తరఫున 30 మంది కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవచ్చని తెలిపారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం సాధారణ బ్యాలెట్ పత్రాల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. వార్డుల వారీగా కౌన్సిలర్, చైర్మన్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్లను వేరు చేసి 25 ఓట్ల చొప్పున కట్టలు కడతామని వివరించారు. చైర్మన్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్లను ప్రత్యేకంగా ఆరో కౌంటింగ్ హాల్‌కు తరలించి లెక్కిస్తామన్నారు. మొత్తం ఎనిమిది గదుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. మొదటి గదిలో 4 వార్డులు, రెండవ గదిలో 8 వార్డులు, మూడవ గదిలో 9 వార్డులు, నాలుగవ గదిలో 5 వార్డులు, ఐదవ గదిలో 8 వార్డులు, ఏడవ గదిలో 8 వార్డులు, ఎనిమిదవ గదిలో 8 వార్డుల కౌన్సిలర్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఆరో గదిని చైర్మన్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా కేటాయించినట్లు





వెల్లడించారు. కౌన్సిలర్ స్థానాల ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం చైర్మన్ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం 30 టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటివరకు ఆరో కౌంటింగ్ హాల్‌లో పది టేబుళ్ల ద్వారా చైర్మన్ ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు. ఈ సమయంలో ఒక్కో చైర్మన్ అభ్యర్థి తరఫున ఒకరి చొప్పున పది మంది ఏజెంట్లకు మాత్రమే హాల్‌లోకి అనుమతి ఉంటుందని, మిగిలిన 20 మంది ఏజెంట్లు బయట వేచి ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ, కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంటాయని తెలిపారు. ఎక్కడా నలుగురికి మించి ప్రజలు గుమిగూడేందుకు అనుమతి లేదన్నారు. ఎన్నికల నమయంలో పోలీసులకు సహకరించినట్లుగానే కౌంటింగ్ సమయంలోనూ సహకరించాలని అభ్యర్థులు, రాజకీయ నాయకులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలకు కమిషనర్ మల్లికార్జున, డీఎస్పీ రవిబాబు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం, టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ సత్తార్, నిజాముద్దీన్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శింగనమలలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారు

### -టీడీపీ నాయకుల తీరుపై మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్ ఆగ్రహం

ప్రజా భూమి శింగనమల

శాంతియుతంగా ఉన్న శింగనమల నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్ టీడీపీ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు దొంగ ఓట్లు వేయించేందుకు టీడీపీ కార్యకర్తలను గూండాలుగా పంపిస్తున్నారని ఆయన ఆరోపించారు. పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లోకి పక్క నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు చెందిన వాహనాలకు నిప్పంటించి ధ్వంసం చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కనీస స్పందన లేదని ఆరోపించారు.



అనంతపురం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆరోపిస్తూ, పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పక్క నియోజకవర్గాల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలు శింగనమల నియోజకవర్గంలోకి ప్రవేశించి గొడవలు సృష్టించకుండా కట్టడి చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరగకుండా, వాహనాల ధ్వంసం వంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడం పోలీసుల బాధ్యత అని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడాలని డా. సాకే శైలజానాథ్ పోలీసు అధికారులను డిమాండ్ చేశారు.

## హిందూపురంలో 50 వార్డులకు కౌంటింగ్

### -రెండు వార్డులు ఏకగ్రీవం.. చైర్మన్ ఓట్లకు 9 రౌండ్లు-మొదటి వార్డు నుంచి వరుసగా లెక్కింపు.. ఒక్కో వార్డుకు రెండు రౌండ్లు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ నెలకొంది. పట్టణంలోని 52 వార్డులకు గాను 7, 11వ వార్డులు కౌన్సిలర్ ఎన్నికల్లో ఏకగ్రీవం కావడంతో మిగిలిన 50 వార్డులకు మాత్రమే కౌన్సిలర్ ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ రెండు వార్డుల్లోనూ చైర్మన్ అభ్యర్థికి ఓట్లు పోలవడంతో వాటిని కూడా చైర్మన్ ఓట్ల లెక్కింపులో పరిగణనలోకి తీసుకోనున్నారు. కౌన్సిలర్ ఎన్నికలకు సంబంధించి ఒక్కో వార్డుకు రెండు రౌండ్ల చొప్పున మొత్తం 100 రౌండ్లు, చైర్మన్ అభ్యర్థుల ఓట్లకు ప్రత్యేకంగా 9 రౌండ్లలో లెక్కింపు చేపట్టే అవకాశం ఉంది. మొదటి వార్డు నుంచి వరుస క్రమంలో లెక్కింపు ప్రారంభం కానుంది. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో పట్టణంలోని 1,31,427 మంది ఓటర్లకు గాను 89,376 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 68 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో 44,541 మంది పురుషులు, 44,832 మంది మహిళలు, ముగ్గురు ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 291 ఓట్లు అధికంగా వినియోగించుకున్నారు. వార్డులవారీగా పోలైన ఓట్లను పరిశీలిస్తే మొదటి వార్డులో 1,799, రెండో వార్డులో 2,049, మూడో వార్డులో 1,809, నాలుగో వార్డులో 1,512, ఐదో వార్డులో 1,722, ఆరో వార్డులో 1,520 ఓట్లు నమోదయ్యాయి. ఏడో వార్డులో 1,317, ఎనిమిదో వార్డులో 1,476, తొమ్మిదో వార్డులో 2,085, పదో వార్డులో 2,193, పదకొండో వార్డులో 1,836, పన్నెండో వార్డులో 1,836 ఓట్లు పోలయ్యాయి. 13వ వార్డులో 1,393, 14వ వార్డులో 1,636, 15వ వార్డులో 1,483, 16వ వార్డులో 1,733, 17వ వార్డులో 1,934, 18వ వార్డులో 1,926, 19వ వార్డులో 1,510, 20వ వార్డులో 1,542, 21వ వార్డులో 1,552, 22వ వార్డులో 1,607, 23వ వార్డులో 1,969, 24వ వార్డులో 1,569 ఓట్లు నమోదయ్యాయి. 25వ వార్డులో 1,623, 26వ వార్డులో 1,565, 27వ వార్డులో 1,531, 28వ వార్డులో 1,788, 29వ వార్డులో 1,732, 30వ వార్డులో 1,632, 31వ వార్డులో 1,415, 32వ వార్డులో 1,533, 33వ వార్డులో 1,477, 34వ వార్డులో 1,816, 35వ వార్డులో 1,659, 36వ వార్డులో 2,218 ఓట్లు పోలయ్యాయి. 37వ వార్డులో 1,686, 38వ వార్డులో 1,830, 39వ వార్డులో 1,317, 40వ వార్డులో 2,112, 41వ వార్డులో 1,681, 42వ వార్డులో 2,400, 43వ వార్డులో 2,165, 44వ వార్డులో 1,846, 45వ వార్డులో 1,346, 46వ వార్డులో 1,695, 47వ వార్డులో 1,633, 48వ వార్డులో 1,722, 49వ వార్డులో 1,618, 50వ వార్డులో 1,697, 51వ వార్డులో 1,699, 52వ వార్డులో 1,932 ఓట్లు పోలయ్యాయి. వార్డులవారీగా పోలింగ్‌ను పరిశీలిస్తే 42వ వార్డులో అత్యధికంగా 2,400 ఓట్లు, 36వ వార్డులో 2,218, 10వ వార్డులో 2,193 ఓట్లు నమోదయ్యాయి. మరోవైపు 7, 39వ వార్డుల్లో అత్యల్పంగా 1,317 ఓట్లు పోలయ్యాయి. ఇప్పుడు ఈ ఓట్లన్నీ అభ్యర్థుల భవిత వ్యాన్ని తేల్చనున్నాయి. కౌన్సిలర్ స్థానాల ఫలితాలతో పాటు చైర్మన్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపుపైనా పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

## ప్రజల ఆశీర్వాదమే కొండంత బలం.. శివానందరెడ్డి గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు!

### నార్పల సత్యనారాయణరెడ్డి అధ్వర్యంలో గ్రామగ్రామాన ప్రచారం.. ఐదు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మద్దతు కోరిన పార్టీ శ్రేణులు

ప్రజా భూమి నార్పల



నార్పల మండల జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జోరు పెంచింది. పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి భూసివల్లి శివానందరెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని దుర్గం, సిద్ధరాచర్ల, మాలవాండ్లపల్లి, కొట్టాల, గొల్లపల్లి గ్రామాల్లో జడ్పీటీసీ అభ్యర్థి బి. శివానందరెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి చీమల లక్ష్మీదేవితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ మద్దతు కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా! జడ్పీటీసీ అభ్యర్థి బూస్వల్లి శివానందరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం, ఆదరణే తనకు కొండంత బలమని తెలిపారు. జడ్పీటీసీగా తనకు అవకాశం కల్పిస్తే నార్పల మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండల అభివృద్ధిలో భాగస్వామిని కావడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి! రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జడ్పీటీసీ అభ్యర్థి శివానందరెడ్డితో పాటు ఎంపీటీసీ అభ్యర్థి చీమల లక్ష్మీదేవిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం కేంద్ర కరువు బృందం పర్యటన

### జిల్లాలోని కరువు పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం ఖరీఫ్-2026 కరువు పరిస్థితులను ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీంకు వివరించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో కరువు పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం లీడర్ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మార రాష్ట్ర నోడల్ అధికారి మరియు రాష్ట్ర వ్యవసాయ డైరెక్టర్ మనజీర్ జీలానీ సమూన్, డా.కె.పొన్నుస్వామి, మరియు కరువు బృందం సభ్యులు మహాలనోబిస్ జాతీయ పంట అంచనా కేంద్రం (వ్యవసాయ మరియు కుటుంబ సంక్షేమ శాఖ) సహాయ సంచాలకులు ప్రభా కాంతి, గ్రామీణ శాఖ అండర్ సెక్రటరీ వినోద్ సమంత్, వ్యయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ పంకజ్ పహాడియా, ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణ ఉ మూల్యాంకన డైరెక్టరేట్ డైరెక్టర్ ఎన్.వి.నతీష్ సీమకుర్తి సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ చంద్, డీఆర్డీఏ పిడి శైలజ, సీపీఓ బాలాజీ నాయక్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
మంగళవారం 03 నవంబరు 2026

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కేంద్రాలు ఖరారు...!

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

## ఐదు రెవెన్యూ డివిజన్లలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు



ప్రజాభూమి ప్రతినిధి,కడప : జిల్లాలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బి.కోడూరు, మైదుకూరు, సాకన్, బి.మట్టం, గోవవరం, కలనపాడు, పోరుమామిళ్ల మండలాలకు బద్వేల్‌లోని అంబేద్కర్ గురుకులాన్ని కేంద్రంగా ఖరారు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వైలవరం, దువ్వూరు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాలకు జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కేంద్రంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు కడపలోని మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని కేటాయించినట్లు వెల్లడించారు. పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాలకు పులివెందులలోని జెడ్పీహెచ్ఎస్, రామనప్ప సత్రం, అన్నకాలమగుడు పాఠశాలను కేంద్రంగా ఖరారు చేసినట్లు తెలిపారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందలూరు, రాజంపేట, టి.సుండుపల్లి, వీరబల్లి మండలాలకు రాజంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేంద్రంగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఖరారు చేసిన కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో బారికేడ్లు, ఇతర భద్రతా ఏర్పాట్లను పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు నిబంధనల ప్రకారం పర్యవేక్షించాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# శ్రీ నిత్య పూజయ్య కోనలో పారిశుద్ధ్య పనులు

## త్రాగునీటి గుండాల వరినరాల్లో శుభ్రత పనులు.. బ్లీచింగ్ పౌడర్ చల్లింపు



ప్రజాభూమి, సిద్ధవటం:
సిద్ధవటం మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపాన లంకమల అభయారణ్యంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నిత్య పూజయ్య కోనలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కోనలోని వంచలింగాల ఆలయం వద్ద భక్తులు వినియోగించే త్రాగునీటి గుండాలు, వాటి పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్రతను సోమవారం తొలగించారు. ఎండోమెంట్ ఈవో సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో కూలీలతో ప్రత్యేకంగా శుభ్రత పనులు చేయించి, త్రాగునీటి గుండాల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. ఆలయానికి వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు, త్రాగునీటి వనరుల వద్ద పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ, సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కలసపాడు మండలంలో కూటమి జడ్పిటిసి అభ్యర్థి భావనాసి విద్యావతి గమ విజయమే లక్ష్యంగా ర్యాలీ

### మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల ప్రచారం



ప్రజాభూమి పోరుమామిళ్ల :
బద్వేల్ నియోజకవర్గం, కలసపాడు మండలంలో కూటమి తరపున పోటీ చేస్తున్న జడ్పిటిసి అభ్యర్థి భావనాసి విద్యావతి విజయమే లక్ష్యంగా సోమవారం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కూటమి జడ్పిటిసి అభ్యర్థి భావనాసి విద్యావతి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మరియు కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో కూటమి అభ్యర్థి విజయానికి తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా రోడ్డు డైరెక్టర్ రంతు, ప్రహ్లాద రెడ్డి, ఈశ్వర్ రెడ్డి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దకుడాల గ్రామంలో కూటమి ఎన్నికల ప్రచారం జోరు

## జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు నరళాదేవి గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం
## మాజీ జడ్పీటీసీ లతారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ హాజరు





ప్రజాభూమి, పులివెందుల:
లింగాల మండలంలోని పెద్దకుడాల గ్రామంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి యమ్మనూరు సరళా దేవి గెలుపే లక్ష్యంగా సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి , పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ , లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవరెడ్డి, లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు యమ్మనూరు విశ్వనాథ్ రెడ్డి,లింగాల మండల సింగిల్ విండో అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలను కలిసి కూటమి అభ్యర్థి యమ్మనూరు సరళా దేవికి మద్దతు తెలిపి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# మురసు తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ముందస్తు జాగ్రత్తలు పాటించాలి -- తహసీల్దార్ ఆర్. విజయ్ కుమార్



ప్రజాభూమి, సిద్ధవటం: మురసు తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిద్ధవటం తహసీల్దార్ ఆర్. విజయ్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. తుఫాన్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు అత్యవసర సమయాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. అవసరం లేకుండా బయటకు వెళ్లరాదని, విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. అధికారులు జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తహసీల్దార్ విజయ్ కుమార్ ప్రజలను కోరారు.

# పులివెందులలో ప్రశాంతంగా రీపోలింగ్

## ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్ – క్యూలైన్లలో బారులు తీరిన ఓటర్లు





ప్రజాభూమి, పులివెందుల:
పులివెందుల మున్సిపాలిటీలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 1వ వార్డులోని పెద్దరంగాపురం లోని 1వ పోలింగ్ కేంద్రం, 3వ వార్డులోని ఉల్లిమెల్ల 1వ పోలింగ్ కేంద్రం, రోటరీపురం 7వ వార్డులోని 1వ పోలింగ్ కేంద్రం, జెండామాన్ వీధి 8వ వార్డులోని 1వ పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించారు. ఉదయం ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు వైఎస్ ప్రమీలమ్మ, తూగుట్ల గీతా కుమారి ఆయా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట మైన బందోబస్తు ఏర్పాటు చేశారు.రీపోలింగ్ లో భాగంగా నాలుగు పోలింగ్ బూత్ లకు సంబంధించి మొత్తం 3039 ఓట్లకు గాను 1926 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# 80 మంది అయ్యప్ప స్వాములకు అన్నదానం

## – భక్తుల సహకారంతో ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ -- గురుస్వామి ఎల్లయ్య



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేట గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన కాడే రామకృష్ణ కుటుంబ సభ్యులు సుమారు 80 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాలు సమకూర్చి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాముల గురుస్వామి ఎల్లయ్య మాట్లాడుతూ, ప్రతిరోజూ మధ్యాహ్నం పలువురు భక్తుల సహకారంతో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ రాత్రి అయ్యప్ప స్వాములచే పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, డిసెంబర్ 11న శబరిమలై యాత్రకు బయలుదేరనున్నట్లు వెల్లడించారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు కఠినమైన నియమ నిష్ఠలు పాటిస్తూ స్వామివారి దీక్షను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్క రించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుం డి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అ భిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లింగా ష్టకం మహా మంగళ హారతులు తదితర పూజా కైంకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ రానున్న కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివాలయంలో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరిగిందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు, ఎండోమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలసపాడులో జెడ్పిటిసి అభ్యర్థి విద్యావతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ



ప్రజాభూమి పోరుమామిళ్ల :
కలసపాడు మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామంలో కూటమి జెడ్పిటిసి అభ్యర్థి భవనాసి విద్యావతి తో కలసి ప్రచారం చేస్తున్న బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిసెట్టి సుప్రజ, రంగసముద్రం పంచాయతీ ఎంపిటిసి నారోజు లక్ష్మీశ్వరమ్మ, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర, కలసపాడు మండలం భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ నారోజు రమణాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసుల రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కందుకూరి చెన్నయ్య, మరొక ఉపాధ్యక్షులు పోకల బ్రహ్మయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి రమణయ్య, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు చెరుకూరు రవికుమార్ , కలసపాడు మండల టిడిపి యువ నాయకుడు దుగ్గిరెడ్డి, ప్రహ్లాద్ రెడ్డి, జనసేన నాయకులు శీలంశెట్టి లక్ష్మయ్య, నగిరి రమణయ్య, బొల్లు వెంకటసుబ్బయ్య, జడ్పిటిసి అభ్యర్థి భర్త ఈశ్వర్ రెడ్డి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. జడ్పిటిసి అభ్యర్థి విద్యావతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# డ్యాన్స్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

## - సేవ్ నేచర్ ఇతివృత్తంతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం




ప్రజాభూమి, వేంపల్లె
కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీల్లో స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుకుని ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. సేవ్ నేచర్ -- ప్రకృతిని కాపాడుకుందాం అనే ఇతివృత్తంతో నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, చెట్ల ప్రాముఖ్యతను చక్కగా వివరించి ప్రేక్షకులు, న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. ఈ విజయంతో విద్యార్థులు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ పోటీల్లో 9వ తరగతికి చెందిన ఏ. గణేష్, కె. హిమబిందు, వై. హేమేంద్రి, 8వ తరగతికి చెందిన బి. బాలయోగి మణిధర్, ఎస్. సిద్ధలక్ష్మీదేవి, ఎన్. అనిత పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కరస్పాండెంట్ ఆకాంక్షించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన డీఈఓ ఎస్. షంషుద్దీన్‌కు పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నృత్య శిక్షణ అందించి ప్రదర్శనను తీర్చిదిద్దిన డ్యాన్స్ మాస్టర్ డి. చిన్నాను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఆర్కే వ్యాలీ విద్యార్థుల విజయకేతనం

## - నలుగురికి ప్రథమ స్థానం.. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత



ప్రజాభూమి, వేంపల్లె
రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆర్కే వ్యాలీ క్యాంపస్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ అండర్--17 జిల్లా స్థాయి యోగా పోటీల్లో విజయకేతనం ఎగురవేశారని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ ప్రకాష్ తెలిపారు. ఇటీవల కడపలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న ఆరుగురు విద్యార్థుల్లో నలుగురు ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించగా, మరో ఇద్దరు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. వారికి క్రమం తప్పకుండా శిక్షణ, మార్గదర్శకత్వం అందించిన యోగా శిక్షకులు అశోక్, శ్రీదేవి కృషిని అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనూ రాణించి జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. రత్నకుమారి, డీన్ డాక్టర్ ఎస్. మహబూబ్ జిలానీ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ జి. రమేష్, డీఎస్‌డబ్ల్యూ రమణారెడ్డి, దీపిక విద్యార్థులను, శిక్షకులను అభినందించారు.

# విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన

## - ఇంధనాన్ని ఆదా చేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం - ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ



ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పట్టణంలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిక్స్--2026 సుస్థిర జీవనశైలి కార్యక్రమంలో భాగంగా ఇంధన పొదుపు అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తును పొదుపుగా వినియోగించాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడుతూ విద్యుత్తును వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. కళాశాలలోనే కాకుండా ఇళ్ల వద్ద కూడా అవసరం లేని సమయంలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయాలని తెలిపారు. ఇంధనాన్ని ఆదా చేయడం ద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును అలవర్చుకుని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు సుస్థిర భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం మొదటి విభాగం కార్యక్రమ అధికారి ఎ. కుమార్ రాజా, రెండో విభాగం కార్యక్రమ అధికారి కె. జనార్ధన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సుస్థిర జీవన శైలి వారోత్సవాలు



ప్రజా భూమి పోరుమామిళ్ల :
దేశంలో ప్రస్తుతం ఎలినో ప్రభావం ఉన్నందున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకశేగా ఏర్పాటు చేసిన సుస్థిర జీవన శైలి వారోత్సవాలు 2026 సందర్భంగా రెండవ రోజు పోరుమామిళ్ల రేంజ్ కార్యాలయంలో రేంజ్ అధికారి రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో ఒక గంట పాటు స్విచ్ ఆఫ్ చేసి విద్యుత్ ను పొదుపు చేయడం ఐనది. ఆ తర్వాత పోరుమామిళ్ల లోని భాగ్యలక్ష్మి హైస్కూల్ లో విద్యార్థులు కు విద్యుత్ మరియు నీటిని ఎలా పొదుపు చేయాలో అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో ఫారెస్ట్ అధికారులు సుస్థిర జీవన శైలి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంతి టీచర్ సుబ్బారెడ్డి, స్కూల్ హెడ్మాస్టర్ రవిశంకర్, ఉపాధ్యాయ బృందం, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు రమణయ్య, రమణ మరియు బిట్ అదికారులు కరుణాకర్, నారాయణ స్వామి, హాసన్ భాష, భారతి, కిషోర్,వెంకటేష్,ప్రతాప్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

మంగళవారం 03 నవంబరు 2026


## ప్రపంచ కరాటే పోటీల్లో...ది స్కూల్ విద్యార్థి




ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

బెంగళూరులో షోరీన్ టెంటో అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ కరాటే చాంపియన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ది స్కూల్ విద్యార్థిని కన్నా హేమకార్తిక కుమెటో మరియు కటా విభాగంలో మొదటి బహుమతి సాధించి రికార్డు సృష్టించిందని కరస్పాండెంట్ జనార్దన్ రావు జె. పవార్ తెలిపారు. కన్నా హేమ కార్తీక మరియు వారి తల్లిదండ్రులను సన్మానించి, అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు చదువుతో పాటుగా క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని, క్రమ శిక్షణకు క్రీడలు ఏంతగానో ఉపయోగ పడతాయి అని అన్నారు. కరాటే మాస్టర్ ఆర్. సంపత్ కుమార్ కి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## హోరు వానలోనూ కాంగ్రెస్ పార్టీ ప్రచారజోరు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

జడ్పీటీసీ అభ్యర్థి బాలగురవం ఝాన్సీ గెలుపు కొరకు డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో సత్యవేడు పట్టణం నందు ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగినది. బాలగురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని. పేద, బడుగు, బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ రావాలని, ఇంతటి వర్షంలోను కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని సంతోషం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి,కేకేసీ జిల్లా అధ్యక్షులు బాలగురవం చిరంజీవి, జిల్లా నాయకులు,నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తేజోవతి గెలుపే లక్ష్యంగా కూటమి నేతల ప్రచారం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాధన్ ఆధ్వర్యంలో ఓటర్లను కలిసి కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రేణిగుంట మండల జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి జి. పాల్యం తేజోవతి గెలుపు కోసం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం రేణిగుంట పట్టణంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి డి. పుష్పనాదన్ ఆధ్వర్యంలో వేణుగోపాలపుర వద్ద ప్రచారం ప్రారంభించారు. అక్కడి నుంచి అన్నదాన సత్రం వీధి, బజారు వీధి, భజన గుడి వీధుల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బీజేపీ జెడ్పీటీసీ అభ్యర్థి తేజోవతికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రేణిగుంట మండల అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కమలం గుర్తుపై ఓటు వేసి తేజోవతికి భారీ మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో టీడీపీ మైనారిటీనాయకులు నవాబ్, నెల్లూరు సుబ్రహ్మణ్యం, వెంకటముని యాదవ్, మహబూబ్ బాషా, ఏలుమలై రెడ్డి, చిత్ర,భాగ్యలక్ష్మి, బాబు టైలర్, సాగర్‌తో తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోరువానలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నకాళహస్తి ఎమ్మెల్యే వెంకటబొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం కొనసాగించారు. అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం ఎమ్మెల్యే బొజ్జల అన్నారు. జోరువా నను సైతం లెక్కచేయకుండా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రేణిగుంట మండలంలోని సూరప్పకసం, విప్పనపట్టడా, వెంకట్ రెడ్డికండ్రిగ, తండ్రం తదితర గ్రామాల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి జి.పాల్యం తేజోవతి, ఎంపీటీసీ అభ్యర్థి యశోదమ్మకు మద్దతుగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రచారాన్ని కొనసాగించిన ఎమ్మెల్యేను పలువురు ప్రజలు అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. జడ్పీటీసీ అభ్యర్థి తేజోవతికి కమలం గుర్తుపై, ఎంపీటీసీ అభ్యర్థి యశోదమ్మకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగు దేశం మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాదముని రెడ్డి, జి.పాల్యం రాజశేఖర్, తమిళం సుధాకర్ రెడ్డి (బాబు రెడ్డి), అవిలాల చెంగయ్య, లోకేష్ రెడ్డి, తంబి దొరై, మురళి, కరుణ, రజిని తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు క్షేమం : కలెక్టర్ హిమాన్షు శుక్ల

ప్రజాభూమి ప్రతినిధి,నెల్లూరు :

కావలి నియోజకవర్గం జువ్వలదిన్నె సమీప సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో అప్రమత్తంగా చేపట్టిన రక్షణ చర్యలతో బోటును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో పాటు అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా రక్షించినట్లు వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు నెల్లూరు సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో సముద్రంలో వాతావరణ మార్పులను గమనించి తిరిగి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకునేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలో బోటు ఇంజన్



చెడిపోవడంతో హార్బర్ మౌత్ పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో సముద్రంలోనే నిలిచిపోయారు. ఈ విషయాన్ని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వైలెన్స్ సిబ్బంది గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో రక్షణ చర్యలు ప్రారంభించారు. సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో తొలుత బోటు వద్దకు చేరుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో బోటుకు వేసిన లంగరు తెగిపోవడంతో సముద్ర అలల ఉధృతికి బోటు పాతకడపాలెం గ్రామం వైపు కొట్టుకుపోయింది. వెంటనే అప్రమత్తమైన మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో బోటును అనుసరిస్తూ రక్షణ చర్యలను కొనసాగించారు. చివరకు బోటును పాతకడపాలెం సముద్ర తీరానికి సురక్షితంగా చేర్చి అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. ఈ రక్షణ చర్యల్లో సమయ స్ఫూర్తితో వ్యవహరించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వైలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

# మురాసు తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత -- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- అత్యవసర సహాయం కోసం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్: 0877-2236007 -జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

మురాసు తుపాను ప్రభావం నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో పాటు ఆర్డీఓలు, తహసీల్దార్లు, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారితో కలసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు అదనపు విద్యుత్ స్తంభాలు, అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని, విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన వెంటనే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు చెరువులు, కాలువలకు గండ్లు



పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా నష్టం సంభవిస్తే తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సిబ్బంది, యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిన సందర్భాల్లో వెంటనే తొలగింపు, పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, గ్రామీణ నీటి సరఫరా శాఖ తాగునీటికి ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అవసరమైన చైన్‌సా కట్టర్లు, ఇతర పరికరాలతో సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు నిత్యావసర సరుకులను తగినంత నిల్వ ఉంచుకుని, అవసరమైన ప్రాంతాలకు సకాలంలో పంపిణీ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు శాఖ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మురాసు తుపాను నవంబర్ 2వ తేదీ రాత్రి నుంచి నవంబర్ 3వ తేదీ తెల్లవారుజామున మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి ప్రాణనష్టం, పశువుల నష్టం జరగకుండా అన్ని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి అన్ని సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని డివిజన్లు, మండలాల కేంద్రాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి నిరంతరం అందుబాటులో ఉండాలని, తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో తుపాను సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం ప్రజలు 0877-2236007 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. ప్రజలు వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అనవసర ప్రయాణాలు నివారించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వర్షంలోనూ తగ్గని టీడీపీ ప్రచార జోరు.. చర్చి కాంపౌండ్ వీధిలో సైకిల్ సందడి!

## వాకాడు అభివృద్ధికి టీడీపీ అభ్యర్థులను గెలిపించండి -- ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడులో వర్షం కురుస్తున్నా ప్రచారానికి విరామం ఇవ్వకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు, అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వాకాడు గ్రామంలోని సోమవారం టెంకాయతోపు, చర్చి వీధి, పోస్ట్ ఆఫీస్ కాలనీ, గుండమ్మ స్టేషన్ సెంటర్, పాత హరిజనవాడ ప్రాంతాల్లో ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, నన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి, నందగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. వాకాడు ఎంపీటీసీ-1 అభ్యర్థి బత్తిన ప్రమీల, వాకాడు జడ్పీటీసీ అభ్యర్థి సన్నారెడ్డి అనితమ్మలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తూ, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా చర్చి కాంపౌండ్ ప్రాంతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారం ఉత్సాహంగా సాగడంతో సైకిల్ ప్రచార సందడి కనిపించింది. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే వాకాడు గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. పేదలకు ఇంటి స్థలాలు కల్పించడంతో పాటు రహదారులు,




విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదే స్ఫూర్తితో వాకాడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే టీడీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, రామలింగారెడ్డి, అన్నమేటి బాలసుబ్రమణ్యం తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరాచకవాదులతో యుద్ధం చేస్తున్నాం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం
- కష్టకాలంలో ప్రజల పక్షాన నిలిచింది చెవిరెడ్డి కుటుంబమే
- ప్రాదేశిక నామినేషన్ లో పోరాడి నిలబడ్డ వారిని గెలిపించాలని కోరారు

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం:

రాష్ట్రంలో ప్రస్తుతం అరాచకవాదులతో యుద్ధం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన సంక్షేమ పాలనను, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అరాచక రాజకీయాలను పోల్చి చూపుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.





– ప్రజాపక్షాన నిలిచేది వైఎస్సార్‌సీపీనే

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న సంక్షేమ ఫలాలు ప్రతీ ఇంటికీ అందాయని భాస్కర్‌రెడ్డి గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యేగా తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని తెలిపారు. కరోనా వంటి అత్యంత విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు అండగా నిలిచాం. రాయలచెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడినప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి గ్రామాలను రక్షించాం. కానీ, ఈ రోజు ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆ నాడు కష్టకాలంలో ఎక్కడ దాక్కున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు.అభివృద్ధికి, అరాచకానికి తేడా గమనించి నామినేషన్ల దాడిలను ఎదురొడ్డి నిలబడిన జడ్పిటిసి అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థులు ఆరేపల్లి నందిని, మునెమ్మ, దొరస్వామి, కర్ణ లను గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నిజమైన సంక్షేమానికి, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో సాగుతున్న ఆక్రమాలు, అరాచక పాలనకు తేడాను ప్రజలంతా గమనించాలని కోరారు. కార్యకర్తలం తా ధైర్యంగా ఉంటూ, ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్సిపురంలో ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్స్ ఓటింగ్

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా 5 తేదీ జరగనున్న జడ్పిటిసి ఎంపీటీసీ పోలింగ్ సందర్భంగా పోలింగ్లో పాల్గొనే మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం వారి ఓటును పోస్టల్ బ్యాలెట్ కోర్టులో భాగంగా మండలంలోని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి ఎస్. వసంత బాయ్ జడ్పిటిసి అభ్యర్థులకు 91 మంది, 04 ఎంపీటీసీ స్థానాలకు గాను 38 మంది ఉద్యోగుల తమ ఓటు హక్కులను వినియోగించుకున్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని డి.ఎస్.పి జగదీష్ నాయక్, ఎస్సై భక్తవత్సలం పర్యవేక్షించారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు
9
మంగళవారం 03 నవంబరు 2026

# తొట్టంబేడులో 260 మద్యం బాటిళ్లు స్వాధీనం - ఒకరు అరెస్ట్

ప్రజా భూమి ప్రతినిధి –తొట్టంబేడు

తిరుపతి జిల్లా తొట్టంబేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల సమయంలో ఓటర్లకు పంపిణీ చేయడానికి అక్రమంగా నిల్వ ఉంచిన 260 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... తొట్టంబేడు మండలం పెన్నలపాడు గ్రామ హరిజనవాడలో అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ ఉన్నాయన్న నమ్మదగిన సమాచారం అందడంతో, శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వారి సెర్చ్ ప్రొసీడింగ్స్ ఆర్డర్ మేరకు, తొట్టంబేడు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్.ఐ. ఎం.స్వాతి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మరియు పంచుల సమక్షంలో శనివారం పెన్నలపాడు గ్రామానికి చెందిన చిట్టత్తూరు సుబ్రమణ్యం ఇంట్లో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో పెన్నలపాడు హరిజనవాడకు చెందినచిట్టత్తూరు.సుబ్రమణ్యం, లేట్ సుబ్బయ్య, వయసు 58 సంవత్సరాలు అనే వ్యక్తి ఇంటిలోని బెడ్ రూమ్ కు ఆనుకుని ఉన్న బాత్రూంలో



రెండు గోనె సంచులలో దాచి ఉంచిన ఆఫీసర్ ఛాయిస్ బ్రాండ్ కు చెందిన 180 మిల్లీలీటర్లు పరిమాణం గల 260 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం మొత్తం పరిమాణం 46.80 లీటర్లు కాగా, దీని విలువ సుమారు రూ. 36,400/– ఉంటుందని పోలీసులు తెలిపారు.ప్రాథమిక విచారణలో నిందితుడు సుబ్రమణ్యం తెలిపిన వివరాల ప్రకారం, రాబోయే ఎంపీటీసీ, జడ్పీటిసి స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పి.కుమార్ తండ్రి పేరు పి.భాస్కరయ్య అనే వ్యక్తి రెండు గోనె సంచులలో మద్యం బాటిళ్లను తనకు తీసుకువచ్చి ఇచ్చాడని, ఎన్నికలకు ముందు రోజు రాత్రి గ్రామంలోని ఓటర్లకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో వాటిని తన ఇంట్లో దాచినట్లు అంగీకరించాడు.ఈ ఘటనకు సంబంధించి నిందితుడు చిట్టత్తూరు సుబ్రమణ్యంను 01.11.2026వ తేదీ సాయంత్రం 06.00 గంటలకు అరెస్ట్ చేసి, తొట్టంబేడు పోలీస్ స్టేషన్ నందు జతీ.చీశే.93/2026 ఖ/రావఎ. 173, కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడానికి మద్యం, నగదు లేదా ఇతర వస్తువులను పంపిణీ చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబ డతాయని పోలీసులు హెచ్చరించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు స్వేచ్ఛా యుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలం దరూ పోలీసులకు సహకరించాలని, ఎన్నికల నియమావళికి విరుద్ధమైన కార్యకలాపాలు ఎక్కడైనా గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పూసలపల్లిలో ప్రభుత్వ రోడ్డు దురాక్రమణపై చర్యలు తీసుకోవాలని - సిపిఐ డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారుపూసలపల్లి గ్రామంలోని ప్రభుత్వ సాధారణ దారి దురాక్రమణకు గురవుతోందని దీనివల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను వారు తహసిల్దార్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, పూసలపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ రోడ్డును ఆక్రమించుకుని ఇటుకలు, నిర్మాణ సామాగ్రి వేసి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 40 సంవత్సరాలుగా ప్రజలు వాడుకలో ఉన్న ఈ దారిని మూసివేయడం వల్ల గ్రామంలోని సుమారు 20–30 కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు ఆక్రమణపై ప్రశ్నించిన స్థానికులను సదరు వ్యక్తులు బెదిరింపులకు గురిచేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ప్రజా అవసరాల దృష్ట్యా రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రోడ్డు దురాక్రమణలను తొలగించాలని కోరారు. బాధితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ దారిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మరియు గ్రామ ప్రజలు మునిచంద్రయ్య, ప్రకాష్, మునస్వామి, స్థానిక గ్రామస్తులు వై. శ్రవణ్, పెంచలయ్య, చిరంజీవి, గోపి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగల రూపంలో యమపాశాలు.. 14 ఏళ్ల గిరిజన బాలుడి దుర్మరణం!

## పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లి విద్యుదాఘాతానికి బలి

ప్రజాభూమి ప్రతినిధి వరదయ్యపాలెం,

రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద గిరిజన కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. చిన్న వయసులోనే కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేందుకు కూలీ పనులకు వెళ్లిన 14 ఏళ్ల బాలుడు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ హృదయవిదారక ఘటన వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..తిరుపతి జిల్లా, వరదయ్యపాలెం మండలం, గోవర్ధనపురం హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో ఓ కళ్యాణమండపం వద్ద వివాహ వేడుకల సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా అలంకరణ కోసం గుంజలు నాటే పనిని గోవర్ధనపురానికి చెందిన సురేష్ కుమారుడు మదన్ (14) చేస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు గుంజలు తగలడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై మదన్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనను గుర్తించిన స్థానికులు వెంటనే బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ, డీఈ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆ కుటుంబానికి ఎవరు అండగా నిలుస్తారు? కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన బాలుడే అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. చిన్న వయసులోనే కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లిన బాలుడి మృతి స్థానికులను కలచివేసింది. నిరుపేద గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా జనావాసాలు, రహదారుల పక్కన ఉన్న విద్యుత్ తీగల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన భద్రతా



చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జోరు వర్షంలోనూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

జడ్పీటీసీ అభ్యర్థి గంగారి సుజాతని మరియు ఎంపీటీసీ అభ్యర్థులు నాగరాజు, హేమలత, దిలీప్ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రార్థన. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రేణిగుంట మండలం, తూకివాకం,తండ్లం, కొట్టరమంగళం, సురప్పకసం లో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి గంగారి సుజాతని అలాగే ఎంపీటీసీ సభ్యులు నాగరాజ్, హేమలత, దిలీప్లను అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి , ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఒక మంచి మనసున్న నాయకుడు,ఎవరు ఏ సమస్య చెప్పిన ఆయన సమస్యల భావించి ప్రజల పక్షాన నిలిచే రమేష్ సతీమణి గంగారి సుజాతని జడ్పిటిసి అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా ఉన్నారని కానీ నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని అన్నారు. గడపగడపలో ప్రజలు ఎన్నో సమస్యలు తెలుపుతున్నారని వాళ్ళ బాధను అన్నింటిని ఓటు రూపంలో చూపించబోతున్నారు అన్నారు.జడ్పిటిసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మరోసారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధగుంట సుధాకర్ రెడ్డి,తిరుమలరెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి,సంధ్య,ఆనంద్ మునిశేఖర్ రెడ్డి చిన్నప్ప శేఖర్ బాబు శ్రీనివాసులు పలని సునీల్ మునిశేఖర్ గౌడ్ సుధాకర్ గౌడ్, ముని రామయ్య సుబ్రహ్మణ్యం నాగరాజు శివ ఢిల్లీ బాబు నవీన్ ప్రవీణ్ సుబ్బు కూలి రవి లక్ష్మీనారాయణ రామ్ చెంగ రెడ్డి క్రాంతి వేణుగోపాల్ రెడ్డి శ్రీహరి కిరణ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# వెస్ట్ వరత్తూరులో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి కందేరి కార్తీక్ చౌదరి విస్తృత ప్రచారం

## -పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : కందేరి కార్తీక్ చౌదరి

ప్రజా భూమి ప్రతినిధి: బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలం కారణి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని వెస్ట్ వరత్తూరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి కందేరి కార్తీక్ చౌదరి ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలు మద్దతుదారులతో కలిసి పంచాయతీలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా కందేరి కార్తీక్ చౌదరికి స్థానిక ప్రజలు, మహిళలు ఘన స్వాగతం పలుకుతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, గ్రామాల్లో నెలకొన్న



సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇస్తున్నారు. వెస్ట్ వరత్తూరు పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని కందేరి కార్తీక్ చౌదరి పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజలు తనకు ఒక అవకాశం కల్పించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీటీసీ అభ్యర్థిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాకాడు అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు.. వైసీపీ శ్రేణుల జోలికొస్తే ఊరుకునేది లేదు!

## ఎన్ని బెదిరింపులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదు.. ప్రజాబలంతో ఎన్నికలను ఎదుర్కొంటాం

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



వాకాడు మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అధికార పక్షంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకునేందుకు బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. వాకాడు మండలాన్ని నాశనం చేసే ప్రయత్నాలను సహించేది లేదని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్ని ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, ప్రజాబలంతో ఎన్నికలను ఎదుర్కొంటామని నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలి

## స్ట్రాంగ్ రూములను క్షుణ్ణంగా పరిశీలించిన తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజా భూమి ప్రతినిధి:
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బి.ఎన్. కండ్రిగ మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను బి.ఎన్. కండ్రిగ మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి తీసుకువచ్చే బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు సిద్ధం చేసిన గదులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూములలోని వసతులు, గదుల భద్రత, తలుపులు, కిటికీలు, తాళాలు, సీల్ ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర భద్రతా పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అక్కడి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ ఎంత ముఖ్యమో, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల భద్రత కూడా అంతే ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్సుల భద్రత విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# చంద్రగిరి మండలంలో ముగిసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్: జడ్పీటీసీకి 266, ఎంపీటీసీకి 200 ఓట్లు నమోదు..!

ప్రజాభూమిప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండల పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా జడ్పీటీసీ స్థానానికి మొత్తం 266 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇక ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 200 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. మండల పరిధిలోని కొన్ని ఎంపీటీసీ స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవం కావడంతో, జడ్పీటీసీ ఓట్లతో పోలిస్తే ఎంపీటీసీ ఓట్ల సంఖ్య 200 వద్దే పరిమితమైనట్లు ఎన్నికల అధికారి శైలజ స్పష్టం చేశారు.

# జోరు వర్షంలో వైఎస్సార్‌సీపీ జోరుగా ఎన్నికల ప్రచారం

## ప్రజా సమస్యలను ఓటు రూపంలో చూపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

ప్రజా భూమి ప్రతినిధి–తొట్టంబేడు



తొట్టంబేడు మండలం జడ్పీటీసీ అభ్యర్థి ఉన్నం వానుదేవ నాయుడు ఎంపీటీసీ అభ్యర్థులు రేవతి,తుపాకుల చెంచయ్య, కౌనల్య,కౌగిలి సుబ్రహ్మణ్యం, రజినీ లను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా ప్రార్థన ఇంటింటా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మరియు పవిత్ర రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సింగమాల, కల్లిపూడి, తాటిపర్తి, మల్లిగుంట, కురవ కన్నేరి, లింగం నాయుడు పల్లి, గుమ్మడి గుంట, గుమ్మడి గుంట ఎస్టీ కాలనీ, పొయ్యి కొత్తూరు, కన్నలి, శివనాథపాలెం, గ్రామంలో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మరియు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి, మరియు మాజీ ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక మంచి మనసున్న నాయకుడు వాసుదేవ నాయుడుని జడ్పిటిసి అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా ఉన్నారని కానీ నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని అన్నారు. గడపగడపలో ప్రజలు ఎన్నో సమస్యలు తెలుపుతున్నారని వాళ్ళ బాధను అన్నింటిని ఓటు రూపంలో చూపించబోతున్నారు అన్నారు.జడ్పిటిసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మరోసారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డ్ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రఘురామరెడ్డి, భక్తవత్సలం, ఓంకార్, భాను, నరసింహులు, ప్రకాష్ రెడ్డి, రాజేంద్ర, వెంకటరమణ నాయుడు, రత్నం, శేఖర్ ,వెంకటయ్య, పెరుమాళ్ రెడ్డి, మునిరాజా, మురళి, భక్తి రెడ్డి, వెంకటేష్, బతినయ్య, ఓబుల్ సుబ్రహ్మణ్యం, చైతు, చిరంజీవి, దుర్గాప్రసాద్ ,పోబాక నాగరాజు ,గంధం నరసింహులు జై ప్రతాప్, మధు, పుట్టల పాపయ్య, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# పాకాల లోకాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి ఎస్.కె.షబీన విస్తృత ప్రచారం..!

ప్రజా భూమి ప్రతినిధి, పాకాల
:(చంద్రగిరి )



తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి ఎస్.కె.షబీన విస్తృత ప్రచారం నిర్వహించారు.పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాలతో చిత్తూరు ఉమ్మడి జిల్లా డిసిసి వైస్ ప్రెసిడెంట్ పఠాన్ మస్తాన్ భాష సహకారంతో పాకాల మండలంలోని ఓటర్లను ప్రతి ఒక్కరిని పలకరించి నేషనల్ కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.మండల ప్రజలు సహకరించి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.పాకాల మండలం నాయకురాలు ఎస్.రజియా,కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొట్టంబేడు మండలంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ప్రజా భూమి ప్రతినిధి – తొట్టంబేడు



తొట్టంబేడు మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో నియమితులైన ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎన్నికల విధుల్లో ఉండటం వలన సొంత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న 107 మంది ఉద్యోగులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు.ఈసందర్భంగా మండల అధికారులు మా ట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతిఉద్యోగి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసి, గోప్యత పాటిస్తూ ఓటు వేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

ప్రజాభూమి
జనరల్ 10
మంగళవారం 03 నవంబరు 2026

## పల్లె పల్లెనా వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు.. మండల వ్యాప్తంగా ఊపందుకున్న ఎన్నికల సందడి!

**జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా గ్రామగ్రామాన విస్తృత ప్రచారం.. నమ్మిన్గిగా కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలు**

ప్రజా భూమి నార్పల

నార్పల మండల వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మండలంలోని పల్లె పల్లెనా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ప్రజలను కలుస్తున్నారు. జడ్పీటీసీ అభ్యర్థి బి. శివానందరెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతూ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరుతున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. నార్పల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో ప్రచార కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయి.

## జోరు వర్షంలోనూ ఆగని ఎన్నికల ప్రచారం.. గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్న మారెడ్డి లతా రెడ్డి

**నలపురెడ్డిపల్లెలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బొంగాని భారతి యాదవ్ తరఫున ప్రచారం**



ప్రజాభూమి, పులివెందుల:

పులివెందుల మండలంలోని నలపురెడ్డిపల్లె గ్రామంలో జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పులివెందుల మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బొంగాని భారతి యాదవ్ తరఫున గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.వర్షం ఎంత తీవ్రంగా కురిసినా ప్రజల్లోకి వెళ్లి మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా ప్రచారం కొనసాగించారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మర్తల జగన్మోహన్ రెడ్డి, యోగానంద రెడ్డి, పులివెందుల మండల మాజీ వైస్ ఎంపీపీ విశ్వనాథ రెడ్డి, బాబు రెడ్డి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపుపై అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



ప్రజాభూమి, సిద్ధవటం: బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు--2026లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిద్ధవటం అటవీ రేంజర్ గుర్రప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 1న కలివికోడి ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో యోగా, ధ్యానం, ప్రకృతి నడక వంటి కార్యక్రమాలు నిర్వహించామని, ఈ కార్యక్రమాల్లో అటవీశాఖ సిబ్బందితో పాటు 50 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. వారోత్సవాల్లో రెండో రోజు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించి, విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ, సుస్థిర జీవనశైలిని తమ నిత్యజీవితంలో అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్, సెక్షన్ ఆఫీసర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పులసలనూతలలో స్వాతీలత రెడ్డి ఎన్నికల ప్రచార జోరు.. కుమారుడు సాకేత్ రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం

**తల్లితో కలిసి తొలిసారిగా ప్రచారంలో పాల్గొన్న యువ నాయకుడు సాకేత్ రెడ్డి.. కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం**



ప్రజా భూమి నార్పల

మండలంలోని వులనలనూతల గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం సందడిగా సాగింది. నార్పల 3వ ఎంపీటీసీ అభ్యర్థి స్వాతీలత రెడ్డి తన కుమారుడు యువ నాయకుడు సాకేత్ రెడ్డితో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలను, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఆప్యాయంగా పలకరించారు. స్థానికులతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ ప్రచార కార్యక్రమంలో యువ నాయకుడు సాకేత్ రెడ్డి తొలిసారిగా తన తల్లి స్వాతీలత రెడ్డితో కలిసి గ్రామానికి రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన రాకతో పార్టీ కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం కనిపించింది. తల్లీకొడుకులు కలిసి ప్రచారంలో పాల్గొనడంతో పార్టీ శ్రేణులు సందడి చేశాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వాతీలత రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. నార్పల 3వ ఎంపీటీసీ స్థానం పరిధిలో పార్టీ అభ్యర్థి తరఫున ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్ యాదవ్, శివ, రాము, రమేష్, రవి, విష్ణు, ఆంజనేయులు, గోపి, రాజప్ప, రామచంద్ర, చిన్ని రాజు, భీమరాజు, శివయ్యతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# "మురసు" తుఫాను ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి..!

**జిల్లాలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు : 08562-246344, 9849904124 ఏర్పాటు**

**క్షేత్ర స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

ప్రజాభూమి ప్రతినిధి,కడప: బంగాళాఖాతంలో ఏర్పడిన "మురసు" తుఫాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తుఫాను పరిస్థితులు, జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, సంసిద్ధతపై సోమవారం జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులు, మండల తహసీల్దార్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో ఎదురయ్యే ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్ల పరిస్థితులను పరిశీలించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, వంకలు, కుంటలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రత్యేక అప్రమత్తత పాటించాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరివాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైనప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బందిని 24 గంటలు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి నియోజకవర్గ, మండల, గ్రామ, సచివాలయ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక, సహాయక బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు, ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులను అప్రమత్తం చేసి పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు



ఇవ్వాలన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పశువులకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అధికారులు అవసరమైన సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని మండలాల్లో తహసీల్దార్లు తాత్కాలిక పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు అందుబాటులో ఉండి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన మందులను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య సంరక్షణ కల్పిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తుఫాను సంబంధిత సమస్యలు, అత్యవసర సహాయం కోసం ప్రజలు కింది ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు:

ల్యాండ్‌లైన్: 08562-246344

మొబైల్: 9849904124

ప్రజలు వాతావరణ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అధికారుల సూచనలు లేకుండా రిజర్వాయర్లు, నదులు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లరాదని జిల్లా కలెక్టర్ కోరారు. తుఫాను ప్రభావం సాధారణ స్థితికి వచ్చే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ

## వేముల మండలంలో వైకాపా ప్రచారం జోరు

**వేల్పుల, బేస్తవారిపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరిగిన జడ్పీటీసీ అభ్యర్థి నాగెళ్ల సత్య ప్రభావతమ్మ**

ప్రజాభూమి, పులివెందుల:

వేముల మండల పరిధిలోని వేల్పుల, బెస్తవారిపల్లి గ్రామాలలో సోమవారం వైకాపా జడ్పీటీసీ అభ్యర్థి ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వేముల మండల వైకాపా జడ్పీటీసీ అభ్యర్థి నాగెళ్ల





సత్య ప్రభావతమ్మ (వైకాపా మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివరెడ్డి సతీమణి), నాగెళ్ల విశ్వేశ్వర్ రెడ్డి, నాగెళ్ల హర్షవర్ధన్ రెడ్డి, నాగెళ్ల హరినాథ్ రెడ్డి ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు.ఈ కార్యక్రమానికి మద్దతుగా మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము) , మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగాల ఉషారాణి , వేల్పుల మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ లు పాల్గొని మద్దతు తెలిపారు.

## రోడ్డులో చెత్త రాశులు దుర్గంధంతో నరకయాతన అనుభవిస్తున్న కాలనీవాసులు

ప్రజా భూమి ప్రతినిధి - తొట్టంబేడు



తొట్టంబేడు గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్ఐసి కాలనీ ఎదురుగా, చిలక మహాలక్ష్మి గుడి ఎదురుగా ఉన్న తొట్టంబేడు గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రహదారి చెత్త డంపింగ్ యార్డ్‌గా మారింది. రోడ్డుకు ఇరువైపులా టన్నుల కొద్దీ చెత్తను గుట్టలుగా పేర్చడంతో ఆ దారి వెంట వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.స్థానికంగా ఉన్న శ్రీకాళహస్తి సాయిబాబా గుడి పరిసరాల్లోని దుకాణదారులు తమ వ్యర్థాలను, పూజా సామాగ్రి వ్యర్థాలను రాత్రికి రాత్రే ఇక్కడికి తీసుకొచ్చి డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, పూలు, ఆహార వ్యర్థాలు, గుడ్డలు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి.ఈ దుర్గంధం వల్ల చుట్టుపక్కల ఉన్న ఎల్ఐసి కాలనీ, తదితర కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి జ్వరాలు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పశువులు కూడా చెత్తను తింటూ రోడ్డుపై తిరుగుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించి,ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త వేసే వారిపై జరిమానాలు విధించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మోహన్ బాబు వర్సిటీలో 'పరిశోధనా పద్ధతులు, ప్రచురణ నైతికత' పై జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం..!

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:



మోహన్ బాబు విశ్వవిద్యాలయంలోని పరిశోధన, ఆవిష్కరణ విభాగం ఆధ్వర్యంలో, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో "పరిశోధనా పద్ధతులు, ప్రచురణ నైతికత" అనే అంశంపై మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి సింగపూర్ నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ నరసింహన్ సుందరరాజన్, మైసూర్ జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మహానంద్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజ శ్రేయస్సు, శాస్త్రీయ పురోగతికి



నాణ్యమైన పరిశోధనలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. పరిశోధనలు కేవలం పత్రాల ప్రచురణకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలకు దోహదపడాలని, నైతిక విలువలు పాటించినప్పుడే అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. తమ వర్సిటీ విద్యార్థులకు, అధ్యాపకులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధనా వసతులు అందిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివి రమణ, రిజిస్ట్రార్ సారథి, పరిశోధన విభాగం డీన్ ప్రొఫెసర్, కన్వీనర్ అవిరేని శ్రీనివాసులు, డిప్యూటీ డీన్ ప్రొఫెసర్, కో- కన్వీనర్ టి.వి.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం..

**- కమిషనర్ ఎం.జయకృష్ణ**

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా తిరుపతి నగరపాలక సంస్థ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో సర్వం సిద్ధం చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ తెలిపారు. నగరంలోని 66 వార్డులలో 304 పోలింగ్ కేంద్రాల్లో మేయర్, కార్పొరేటర్ల కు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల నుండి తెచ్చిన బ్యాలెట్ బాక్సులను ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచామని తెలిపారు. 304 పోలింగ్ కేంద్రాల నుండి వచ్చిన బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కింపు చేస్తారని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామని తెలిపారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు వేర్వేరుగా లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కొరకు 66 వార్డులకు 77టేబుల్స్, మేయర్ కి 35 టేబుల్స్ మొత్తం 112 టేబుల్స్ ఏర్పాటు చేసామని తెలిపారు. 600 మంది సూపర్ వైజర్లు , 300 మంది సహాయక సిబ్బంది కి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. సీసీ కెమెరాల వెబ్ కాస్టింగ్, పోలీసుల పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నామని తెలిపారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

## తెదేపా ప్రచారాన్ని ఓర్వలేక వైసీపీ నేతలు దాడి...

ప్రజా భూమి యల్లనూరు



మండల పరిధిలోని వెన్నపూస పల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం తరఫున పోటీ చేయు అభ్యర్థులతో పాటు ఇంటింటికి వెళ్లి ప్రచారం సాగిస్తూ ఉండగా అదే సమయానికి కొంతమంది వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తులు మోటార్ సైకిల్ తో గంగా రాజేష్ రెడ్డి ని గుద్ది అతని చంపాలని ఉద్దేశంతో రామేశ్వర్ రెడ్డి బోగాతి ప్రతాపరెడ్డి భోగాతి నాగేశ్వర్ రెడ్డి ఇంకా వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తులు అతనిపై ఇనుప రాడ్డతో, కట్టెలతో దాడి చేసి కొట్టగా గంగరాజు రెడ్డికి తీవ్రమైన రక్త గాయాలు కావడంతో రాజేష్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు

## మినుము సాగులో అధిక దిగుబడులపై రైతులకు శిక్షణ...

**ఖేత్ బచావో అభియాన్‌లో భూసార పరిరక్షణపై అవగాహన...**

ప్రజాభూమి ప్రతినిధి, మైదుకూరు



మినుము సాగులో ఆధునిక శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు, విద్యార్థులు రైతులకు సూచించారు. మైదుకూరు మండలం అన్నలూరు గ్రామంలో సోమవారం ఎస్వీ వ్యవసాయ కళాశాల, తిరుపతికి చెందిన గ్రామీణ వ్యవసాయ కార్యానుభవ కార్యక్రమం (రావెప్) విద్యార్థుల ఆధ్వర్యంలో మినుము సాగు సాంకేతికతలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప డీఏఏటీసీ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్. కృష్ణప్రియ హాజరై ఖేత్ బచావో అభియాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు విత్తన శుద్ధి, సరైన విత్తన మోతాదు, వరుసలు, మొక్కల మధ్య తగిన దూరం పాటించాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం, కలుపు నివారణ, సకాలంలో చీడపీడల నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా వంట దిగుబడులను పెంచుకోవచ్చని వివరించారు. ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా భూసార పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. నేలలో సేంద్రియ కర్బనం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులను వినియోగించాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులోనే ఉపయోగించాలని తెలిపారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను సమతుల్యంగా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు దిగుబడులను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే అనవసరంగా అధిక మోతాదులో పురుగుమందులు, కలుపు మందులు వాడకుండా సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రావెప్ విద్యార్థులు నల్లపెసర సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ రైతులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

ప్రజాభూమి
జనరల్ 11
మంగళవారం 3 నవంబరు 2026

# పోలవరం జిల్లాలో 12 జెడ్పీటీసీ, 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు

- నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారం ముగింపు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి 12 జెడ్పీ టీసీ, 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5వ తేదీన పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం 3 వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని సోమవారం ఒక ప్రకటన స్పష్టం చేశారు.

**నవంబర్ 3వ తేదీ వరకే ప్రచార అనుమతులు**

ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ముందస్తుగా పొందిన అనుమతులు నవంబర్ 3వ తేదీ వరకు మాత్రమే అమల్లో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ప్రచార సభలు, ర్యాలీలు, వాహనాలు, లౌడ్ స్పీకర్ల వినియోగం తదితర అంశాలకు సంబంధించి సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందిన నిబంధనల మేరకే వ్యవహరించాలని సూచించారు. అనుమతుల గడువు ముగిసిన అనంతరం వాటిని వినియోగించరాదని స్పష్టం చేశారు.

**ప్రచార ముగింపు సమయాన్ని పాటించాలి**

నవంబర్ 3 వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారం పూర్తిగా నిలిపివేయాలని కలెక్టర్ తెలిపారు. ఆ సమయం తర్వాత బహిరంగ సభలు, ర్యాలీలు, మైకుల ద్వారా ప్రచారం, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు సహకరించాలి**

ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావులేకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# MPTC, ZPTC ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

## స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ హాళ్లలో భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పోలీస్ సూపర్డెంట్ కే చక్రవర్తి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఓ ఎస్ డి జావలి, రంపచోడవరం సబ్ కలెక్టర్ డీ. పృథ్వీరాజ్ కుమార్ తో కలిసి రంప చోడవరంలో ఎన్నికల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు.పోలవరం జిల్లాలో వీఆజ్ఞాజ రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను అన్ని విధాలా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్,జిల్లా ఎస్పీ,జాయింట్ కలెక్టర్‌తో కలిసి రంపచోడవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ హాళ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, గదుల లభ్యత, ఎన్నికల సామగ్రి భద్రపరిచే విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**12 మండలాలకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు**

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలవరం జిల్లాలోని చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో మొత్తం 12 మండలాలకు సంబంధించి ఎన్నికల కేంద్రాలను ఖరారు చేశారు. చింతూరు డివిజన్‌లో చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఏటపాక మండలాలకు పంపిణీ, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను చింతూరులోని ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల, ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్నారు. రంపచోడవరం డివిజన్‌లో అడ్డతీగల, దేవీపట్నం, రాజవొమ్మంగి, వై.రామవరం, గుర్తేడు, గంగవరం, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాలకు సంబంధించి ఆయా మండలాల పంపిణీ కేంద్రాలను స్థానికంగా నిర్దేశించగా, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ ఏర్పాట్లను రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాలల్లో నిర్దేశించిన గదుల్లో చేపట్టనున్నారు.

**ఓటింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెల తరలింపునకు ప్రత్యేక రూట్లు**

నవంబర్ 5వ తేదీన ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలైన బ్యాలెట్ పెట్టెలు, ఎన్నికల సంబంధిత పత్రాలను పటిష్ట పోలీసు భద్రత నడుమ ఆయా మండలాలకు కేటాయించిన రిసెప్షన్ కేంద్రాలకు చేర్చాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా వివిధ మండలాల నుంచి రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేక రూట్లను నిర్దేశించి, రవాణా ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బ్యాలెట్ పెట్టెల తరలింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, రూట్లలో సమన్వయం కోసం సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల భద్రత**

స్ట్రాంగ్ రూముల వద్ద బ్యాలెట్ పెట్టెల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 24 గంటలూ తగినంత మంది సాయుధ పోలీసు సిబ్బందిని మోహరించాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీ కెమెరాల నిరంతర నిఘా, డబుల్ లాక్ వ్యవస్థ, కఠినమైన ప్రవేశ నియంత్రణను అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధం లేని వ్యక్తులకు స్ట్రాంగ్ రూముల పరిసరాల్లోకి ప్రవేశం కల్పించరాదని స్పష్టం చేశారు.

**మౌలిక సదుపాయాల కల్పనకు ఆదేశాలు**

రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లలో విద్యుత్, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రవేశ మార్గాలు, అగ్నిమాపక భద్రత తదితర కనీస సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కేటాయించిన విద్యాసంస్థల గదులను సంబంధిత రిటర్నింగ్ అధికారులు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇతర అవసరాలకు వినియోగించకుండా రిజర్వులో ఉంచాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వారు వెంట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అశ్రఫ్ అలీ, ఎస్ డి సి బాలకృష్ణ, తహసిల్దార్ సిహెచ్ బాలాజీ, ఈ ఈ ఐ శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రైతు కూలీలను కలిసిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు







ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

వి.ఆర్.పురం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పొగాకు చేలల్లో పనిచేస్తున్న రైతు కూలీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న రైతులు, రైతు కూలీలు, మహిళలు, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. రైతు కుటుంబాలకు అండగా నిలిచి వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించడంతో పాటు మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ఈ దగా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు. నవంబర్ 5న జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వి.ఆర్.పురం మండలంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ఆయన కోరారు. జడ్పీటీసీ అభ్యర్థి బంధం విజయలక్ష్మికి ఒక ఓటు, మీ రేఖపల్లి ఎంపీటీసీ అభ్యర్థి సోడి దినేష్‌కు ఒక ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పొగాకు చేలల్లో పనిచేస్తున్న కూలీలను అభ్యర్థించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. స్థానిక సంస్థల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి బంధం విజయలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, మామిడి బాలాజీ, మండల ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు, మడకం కన్నారావు, మోసం సంజీవరావు, అమరవరపు సత్తిరాజు, ముత్యాల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితుల హక్కుల కోసం సీపీఎం పోరాటం

- సుత్తి-కొడవలి-నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించండి
- కారం సుజాత, పూసం రవివర్మ







ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. సీపీఎం బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థిని కారం సుజాత, వడ్డిగూడెం ఎంపీటీసీ అభ్యర్థి పూసం రవివర్మ సోమవారం వడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం, వి.ఆర్.పురం, బీసీ కాలనీ గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి తమ సుత్తి-కొడవలి-నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు చివరి కుటుంబం వరకు పూర్తిస్థాయి నష్టపరిహారం, పునరావాసం కల్పించడంతో పాటు, గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. రేఖపల్లి, ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు సుద్దగూడెం, తోటపల్లి (మొద్దులగూడెం), అన్నవరం, రెడ్డిగుంపు, ఉమ్మడివరం, గుర్రంపేట, నూతిగూడెం, చిన్నమట్టపల్లి, సున్నం వారిగూడెం, జల్లివారిగూడెం తదితర గ్రామాలను ముంపు కాంటూరులో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని కోరారు. పెద్దమట్టపల్లి నుంచి కుందులూరు మీదుగా నర్సింగపేట వరకు తారు రోడ్డు నిర్మించాలని, అన్నవరం వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రామవరంలోని 104 కుటుంబాలకు సకర్వాల్యూ ప్యాకేజీ అందించాలని కోరారు. వలస ఆదివాసీ గ్రామాలకు విద్యుత్, తాగునీరు, రహదారులు, పాఠశాల సదుపాయాలు కల్పించడంతో పాటు ఆయా గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అన్ని రకాల భూములకు 2013 చట్టం ప్రకారం భూనష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అదనంగా 30 ఎకరాల భూమిని కాలనీ ప్రజలకు కేటాయించాలని కోరారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, శానిటేషన్ కార్మికులు, వీఆర్ఏలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు వీవోఏలు, హాస్టల్ వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగులు భూములకు భూమికి భూమి లేదా భూనష్ట పరిహారం నిర్వాసిత రైతులకు అందించాలని, గతంలో ఎకరాకు రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.5 లక్షల భూనష్ట పరిహారం చెల్లించాలని కోరారు. మండలంలో అంగన్వాడీ పాఠశాలలు లేని ప్రాంతాల్లో సొంత భవనాలు నిర్మించాలని, అంగన్వాడీ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని వి.ఆర్.పురం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని అన్నారు. కుందులూరు మీదుగా తులసిపాక వరకు నూతన రహదారి నిర్మించాలని, కుంపులూరు నుంచి కుందులూరు, పెద్దమట్టపల్లి మీదుగా రేఖపల్లి వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు, ఆదివాసీలు, కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని, ప్రజా సమస్యల సాధనకు తమ వంతు కృషి చేస్తామని కారం సుజాత, పూసం రవివర్మ తెలిపారు.





## దీపావళి విక్రయదారులు అనుమతులు తప్పనిసరి

### -సబ్ కలెక్టర్ డి పృథ్వీరాజ్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం



దీపావళి మందుగుండు సామగ్రి విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిస రిగా రెవెన్యూ శాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాలని రంపచో డవరం సబ్ కలెక్టర్ డి.పృథ్వీ రాజ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాల యంలో ఈ నెల 8వ తేదీన జరగనున్న దీపావళి పండుగ నేపథ్యంలో మందుగుండు సామగ్రి విక్రయ దుకాణాల ఏర్పాటుపై డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, రంపచోడవరం డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో దీపావళి మందుగుండు సామగ్రి విక్ర యించాలనుకునే వ్యాపారులు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుని తప్ప నిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. దుకాణాలను గ్రామాలకు దూరంగా,ఊరి చివరన ఉన్న ఖాళీ ప్రదేశాల్లోనే ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన సూచించారు. మందుగుండు సామగ్రి విక్రయించే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, ఆయా మండ లాల్లో అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందుగుండు సామగ్రి విక్రయదారులు ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, దుకాణాల వద్ద ప్రజలకు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిం చాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లు సీహెచ్ బాలాజీ, కరక సత్యనారా యణ, అమ్మాజీ, సీహెచ్ శ్రీనివాసరావు, తేజస్విని, స్వామి, శ్రీరాములు, సబ్ కలెక్టర్ పరిపాలన అధికారి ఏ. సత్యనారాయణ, పోలీస్ అధికారులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో నేటి సాయంత్రంతో ముగియనున్న మైక్ ప్రచారం

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల



అడ్డతీగల మండలంలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల అభ్యర్థులకు మైక్‌ల ద్వారా ప్రచారం నిర్వహించుకునేందుకు నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉందని అడ్డతీగల రిటర్నింగ్ అధికారి కె. రమణ తెలిపా రు.ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు ముగిసిన అనంతరం మైక్‌ల ద్వారా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిం చరాదని స్పష్టం చేశారు. ప్రచార సమయంలో అభ్యర్థులు, రాజ కీయ పార్టీలు పోలీసుల సూచనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటిం చాలని సూచించారు.గడువు ముగిసిన తర్వాత కూడా ప్రచారం కొనసాగిస్తే నిబంధనల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల అధికారులకు, పోలీసు శాఖకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి కె. రమణ విజ్ఞప్తి చేశారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణపై సమగ్ర శిక్షణ



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, పక్షపాత రహితంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సమగ్ర శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారి కె. రమణ హాజరై పోలింగ్ రోజు చేపట్టాల్సిన విధులు, పాటించాల్సిన నియమ నిబంధనలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణ, పోలింగ్ సామగ్రి భద్రత, ఓటింగ్ ప్రక్రియ, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. పోలింగ్ సమయంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించే విధానాలను వివరించారు.ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, నీడతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటు గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని, పోలింగ్ సామగ్రిని భద్రంగా ఉంచాలని ఆదేశించారు.అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతించబడిన వ్యక్తులనే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.వి.వి. కుమార్, రిటర్నింగ్ అధికారి-2 తేజస్వినితో పాటు పలువురు పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అధికారులు సూచించారు.

# రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయింది

❖ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపాం
❖ గొడ్డలి పార్టీ పాలనలో సంక్షేమంలో కోతలు.. అభివృద్ధి వాతలు తప్ప ఇంకేం లేదు
❖ మచిలీపట్నం రూరల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి ప్రచారంలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం సౌత్ మండలం మండలం వాడపాలెం, చిన్నవాడపాలెం, వెంకట దుర్గాపురం, సత్యనారాయణపురం, కెపిటిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థి కాగిత వెంకటేశ్వరరావు ఎంపీటీసీ అభ్యర్థి కూనపరెడ్డి కృష్ణ కుమారి, కేశన నాగ లక్ష్మీతో కలిసి ప్రజల్లోకి వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. 50 సంవత్సరాలకే పెన్షన్ ప్రవేశపెట్టిన ఘనత కూడా చంద్రబాబు నాయుడు కే దక్కుతుంది. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బిడ్డకూ రూ. 15,000 చొప్పున అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు అందిస్తున్నాం.



మత్స్యకారులకు వేట నిషేధ భృతి, అన్నదాత సుఖీభవ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతు న్నామన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అభి వృద్ధి లక్ష్యంగా గత అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. గత ఐదు సంవ త్సరాలు కనీసం ఒక పార మట్టి తీయని పరిస్థితి నుంచి, నేడు దశలవారీగా రోడ్లన్నీ పూర్తి చేశాం. వచ్చే సంవత్సరం నుండి డ్రైనేజీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా రోడ్లపై నిలబడకుండా, మురుగు లేకుండా చేసే బాధ్యత తీసుకుం టున్నాం.

ప్రతి ఇంటికీ తాగునీటి కులాయి ఏర్పాటు చేస్తున్నాం. ఆ కార్యక్రమాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తాం. జలజీవన్ మిషన్ కింద బందరు నియోజకవర్గంలో దాదాపు రూ.75 కోట్లు ఖర్చు చేశాం. కె.పి.పాలెం గ్రామానికి రూ.66 లక్షలు మంజూ రయ్యాయి. కోడూరు - ఉల్లిపాలెం బ్రిడ్జ్, కోడూ రు, నాగలంక, అవనిగడ్డ డెల్టా ప్రాంతంలో ఆనాడు చంద్రబాబు నాయుడు గారు ఉల్లిపాలెం బ్రిడ్జ్ నిర్మించారు. బందర్ కోట నుంచి గరాల దిబ్బ మీదగా పోలాటితిప్ప, నడిమేరు, గుండెరు వద్ద రెండు వంతెనల నిర్మాణం జరుగుతున్నాయి. గ్రామాల్లో సమస్యలు తెలిసిన వారు నాయకులుగా ఉన్నప్పుడే అభివృద్ధి జరుగుతుంది. ఎం.పి.టీ.సి.గా కృష్ణకుమార్ , జెడ్పీటీసీగా వెంకటేశ్వరరావు ని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుకుంటున్నా మన్నా రు. బందరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, బందరు పోర్టు నిర్మాణాన్ని ఇప్పటికే ప్రారంభించామన్నారు. వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని మచిలీపట్నానికి త్వరలోనే ఓడలు రాబోతున్నాయని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు.

బందరు పోర్టుకు అనుబంధంగా గోవా షిప్‌యార్డ్ సంస్థ రూ. 8,000 కోట్ల పెట్టుబడితో 10,000 మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ఏర్పాటు కాబోతోంది. తద్వారా మన యువతకు ఎక్కువ ఉద్యోగాలు వస్తాయి. పిల్లల చదువులకు తగ్గట్టుగా ఐటీఐలు మరియు స్కిల్ డెవలప్‌మెంట్ చేసి మన పిల్లలకే ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లో కూటమి ప్రభుత్వం ఉంటే ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ నడిపించి, అభివృద్ధిని వేగవంతం చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## కరగ్రహారం, పోతేపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్లలో గోపు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



కరగ్రహారం, పోతేపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్లలో జెడ్పీటీసీ అభ్యర్థితో కలిసి కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ గారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి సైకిల్ గుర్తుకు, కరగ్రహారం మరియు పోతేపల్లి ఎంపీటీసీ అభ్యర్థుల సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా అభ్యర్థుల విజ యా న్ని ఆకాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకున్నారు.ఈ కార్య క్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, క్లస్టర్ ఇంచార్జి లంకే శేషగిరిరావు, క్లస్టర్ ఇంచార్జి తలారి సోమశేఖరరావు, బత్తిన నాగరాజు బోలెం అయోధ్య , బొర్రా రాము, నాగుల్ మీరా, కమ్మిలి మధు, కాగిత శేషు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మచిలీపట్నంలో ఎల్ఐసీ ఉద్యోగుల సంఘీభావ ప్రదర్శన

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 2, 3 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా ఏఐఐఈఏ పిలుపు మేరకు సోమవారం మచిలీపట్నంలో స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యా లయం వద్ద ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీకి ఉన్న 60.72 శాతం వాటాను ప్రైవేటు సంస్థకు విక్రయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. లాభదాయకంగా పనిచేస్తున్న బ్యాంకును ప్రైవేటీకరించడం సమర్థనీయం కాదని, విదేశీ ఆర్థిక సంస్థల ఆధిపత్యం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి హానికరమని హెచ్చరించారు. ఐడీబీఐలో ప్రభుత్వ వాటా కనీసం 51 శాతం కొనసాగుతుందని 2003లో పార్లమెంటుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిధుల సమీకరణ కోసం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు.ఈ ప్రదర్శనలో యూనియన్ నాయకులు డి. వాసు, వై. స్వామినాథ్, ఏ. మల్లికార్జున ప్రసాద్ SV. రత్నరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం

**వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో పర్యటించిన మంత్రి కొల్లు రవీంద్ర**




మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మచిలీపట్నం రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విస్తృతంగా పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు.వాడపాలెం పంచాయతీ పరిధిలోని చిన్నాపురం, వాడపాలెం, వెంకట దుర్గాపురం, సత్యనారాయణపురం, కె.పి.టి. పాలెం గ్రామాల్లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి మంత్రి ప్రచారం నిర్వహించారు. మచిలీపట్నం దక్షిణ మండల జెడ్పీటీసీ అభ్యర్థి కాగిత వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, చిన్నాపురం ఎంపీటీసీ అభ్యర్థి కాత్రం నాంచారయ్యకు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.వర్షం కురుస్తున్నప్పటికీ ప్రచార కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే వారికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పెన్షన్ల నుంచి మెగా డీఎస్సీ వరకు అనేక హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. తొలి రోజు నుంచే రూ.4 వేల పింఛన్ అమలు చేస్తున్నామని, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మెగా డీఎస్సీ నిర్వహించడంతో పాటు జాబ్ క్యాలెండర్ ప్రకటించామని వివరించారు.మచిలీపట్నం అభివృద్ధికి బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు కీలకమని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బందరు ప్రాంతానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలి పారు. ఓటు హక్కును వినియోగించుకునే ముందు ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, ఏ అభ్యర్థిని గెలిపిస్తే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందో నిర్ణయించుకోవాలని కోరారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలంటే కూటమి బలపరిచిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

## కోడూరు మండలంలో కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

**ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు**

కోడూరు, అవనిగడ్డ ప్రజాభూమి ప్రతినిధి



కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు మండలంలో కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కూటమి బలపరిచిన తెలుగు దేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి బొలిశెట్టి (బండే) అరుణశ్రీ, ఎంపీటీసీ అభ్యర్థులు కూటమి నాయకు లతో కలిసి సోమవారం ఉల్లిపాలెం, శ్రీరాం పురం, స్వతంత్రపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలు సు కుంటూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి బొలిశెట్టి అరుణశ్రీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూర్చేలా కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో కోడూరు మొదటి సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి కొండవీటి సునీత, రెండో సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి ముద్దినేని చంద్రరావు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు బండే శ్రీనివాసరావు, అద్దంకి పాండురంగారావు, అప్పికట్ల రవీంద్ర, జాన్ విల్సన్, బండే వెంకటేష్, బండే చరణ్ తేజ, కోట రాంబాబు, కాగిత రామారావుతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మురసు తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

❖ తుపాను పూర్తయ్యే వరకు ఇళ్లలోనే ఉండాలి ❖ కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:




మురసు తుపాను ప్రభావం కృష్ణా జిల్లాపై ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమ త్తంగా ఉండాలని, తుపాను పూర్తయ్యే వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి విజ్ఞప్తి చేశారు.సోమవారం మొవ్వ మండల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజలను ఉద్దేశించి మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సోమవారం సాయంత్రం నుంచి జిల్లాలో గాలుల ప్రభావం ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. తుపాను సమయంలో ప్రజలు బయటకు వెళ్లడం వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిం చారు. ముఖ్యంగా కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగల వద్ద నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తుపానుల సమయంలో జరిగే ప్రమా దాలు, ప్రాణనష్టానికి ప్రధాన కారణాలను పరిశీలిస్తే చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, నీటిలో పడిపోయిన విద్యుత్ తీగలను తాకడం వంటి ఘటనలు ఉంటాయని తెలిపారు.

వీటిని నివారించేందుకు ప్రజలు తుపాను పూర్తయ్యే వరకు ఇళ్లలోనే ఉండటమే అత్యంత సురక్షితమైన మార్గమని పేర్కొన్నారు.తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉన్నం దున ప్రజలు ముందస్తుగా అప్రమత్తమై ఒకటి, రెండు రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, అత్యవసర మందులను ఇంట్లో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.తుపాను సహాయక చర్యలకు మండల స్థాయిలో బృందాలుతుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో ఎంపీడీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రతి మండలంలో ఒకటి, రెండు ప్రాంతాల్లో అవసరమైన యంత్ర పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించినట్లు తెలిపారు. చెట్లు కూలిపోవడం, రహదారులకు అడ్డంకులు ఏర్పడటం వంటి పరి స్థితులు తలెత్తితే వెంటనే తొలగించేందుకు జేసీబీలు, పవర్ సా వంటి పరికరాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.తుపాను ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని, తుపాను ప్రభావం తగ్గిన వెంటనే విద్యుత్, రహదారులు తదితర అత్యవసర సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యమని, జిల్లా యంత్రాంగం చేపడుతున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకరించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలి -ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:



రాష్ట్రంలో ముంచుకొస్తున్న తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి సంసిద్ధతతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, వైద్య, విద్యుత్, ఇరిగేషన్ తదితర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, పూరిళ్లలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సుర క్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. క్యాంపుల్లో ఆశ్రయం పొందు తున్న వారికి నేటి రాత్రి నుంచే భోజనం, తాగునీరు, వసతి వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాల న్నారు. గర్భిణులు ముఖ్యంగా ప్రసవానికి సమీపంలో ఉన్నవారు, బాలింతలు, వృద్ధులు, చిన్నారుల ను ముందుగానే సమీప ఆరోగ్య కేంద్రాలు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మండల కేంద్రాల్లో, కలెక్టరేట్‌లో 24/7 కాల్ సెంటర్లు, అత్యవసర స్పందన కేంద్రాలు నిరంతరం పనిచేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, వర్షం, చెట్లు కూలడం, ముంపు వంటి వివరాలపై ప్రతి గంటకూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. ప్రతి మండలంలో ట్రాక్టర్లు, జేసీబీలు, టెంపోలు, రోప్‌లు, పవర్ సాస్, టార్చ్ లైట్లతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల రహదారులపై చెట్లు విరిగి పడినా లేదా విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా అరగంట వ్యవధిలోనే ట్రాఫిక్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు, ట్యాంకుల పరిస్థితిని ఇరిగేషన్, రెవెన్యూ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. 100 శాతం నిండిన చెరువుల కట్టలు తెగిపోకుండా ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పూర్తిస్థాయిలో నిండని చెరువుల్లోకి వర్షపు నీరు చేరేలా ఇరిగేషన్ ఏఈ, డీఈలు చర్యలు చేపట్టి సుమారు 2 నుంచి 3 టీఎంసీల వరకు నీటిని ఒడిసిపట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. తాగునీటి క్లోరినేషన్ నిరంతరం జరగాలన్నారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు. రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉన్న మారుమూల గ్రామాలు, లంక గ్రామాల్లో రేషన్, నిత్యావసర సరుకుల నిల్వలు ముందస్తుగానే అందుబాటులో ఉండేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా ప్రతి శాఖ సమన్వయంతో,బాధ్యతాయుతంగా పనిచేసి నష్టం వాటిల్లకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

## 60 సం|| లు దాటిన వారికి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుండి మినహాయింపులు లేవా?

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



నిన్నటి వరకూ వివిధ కార్పొరేషన్లు, మునిసిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 5వ తేదీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ ఎన్నికల విధులలో 60 సం||లు దాటిన ఉపాధ్యాయులను, ఉద్యోగులను భాగస్వాములుగా చేయడంవల్ల వారు ఎన్నికల విధులు సరిగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతోంది. అంతేగాక దివ్యాంగులు, అనారోగ్య సమ స్యలతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపులు కల్పించాలి. సాధారణంగా ఎన్నికల విధులు ఇలాంటి వారికి వేయకూడదు. కొన్ని అనివార్య కారణాలవల్ల వేసినా అలాంటి వారికి మినహాయింపులు కచ్చితంగా ఇచ్చి తీరాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతు న్నాయి. సోమవారం సాయంత్రం నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో డిఆర్వో ఛాంబర్ వద్ద ఎన్ని కల విధుల నుంచి మినహాయింపు కోరుతూ దివ్యాంగులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు తమ తమ రిప్రజంటేషన్లను ఇచ్చి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వవలసిందిగా అభ్యర్థించడానికి వేచి చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. గంటలకొద్ది వారు వేచి ఉన్నా వారి సమస్య ఇంతవరకూ పరిష్కారం కాలేదు. ఇలాంటి వారిని ముందుగానే గుర్తించి ఇలా అనారోగ్య సమస్యలతోను, ఎన్నికల విధులు నిర్వహించలేని ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించకుండా వుండడమే సరైన పరిష్కారం. సాధారణంగా ఎన్నికల విధులు నిర్వహించడానికి 20 శాతం అద నంగా రిజర్వు సిబ్బందిని నియమిస్తారు. ఇలా అనారోగ్య సమస్యలతో వచ్చి తమ అభ్యర్థనలను సమర్పించే ఉద్యోగ, ఉపాధ్యాయులను గుర్తించి రిజర్వు స్థానంలో ఉన్న ఉపాధ్యాయులను వారి స్థానంలో కేటాయించి వీరికి ఎన్నికల విధుల నుంచి విముక్తి కలిగించాలని అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థన కోసం వేచి చూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశా నిస్పృహలే మిగులు తున్నాయి. భవిష్య త్తులో ఇలా ఎన్నికల విధులు నిర్వహించలేని ఉద్యోగ, ఉపాధ్యాయులను గుర్తించి ముందుగానే వారికి విధుల నుంచి మినహాయింపు ఇస్తే వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయవలసిన అవసరం లేదు. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి, దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇస్తే వారికి ఉపశమనం కలుగుతుంది.

## పొట్టి శ్రీరాములుకు వీర్నాల ఫౌండేషన్ ఘన నివాళి

**ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి



ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినో త్సవాన్ని పురస్కరించుకుని వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరు మండలం కోకనారాయణపాలెం గ్రామంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ వీర్నాల బాలాజీ, ఆయన తండ్రి నాంచారయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వీర్నాల బాలాజీ మాట్లాడుతూ, తెలుగు ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన లక్ష్యంగా 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.



అనంతరం "మన ఊరు – మన బాధ్యత" అనే నినాదంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోకనారాయణ పాలెం, వీర్నాల తోట, అనంతాయపేట గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల సంభవించిన తుఫాను ప్రభావంతో రహదారులపై పేరుకుపోయిన ఆకులు, చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ సీసాలను గ్రామస్తుల సహకారంతో సేకరించి తొలగించారు.ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు సమిష్టిగా పాల్గొని వీధులు, పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటిచెబుతూ చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలిచింది. ప్రజల్లో సామాజిక బాధ్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఏనుగు గుర్తుకు ఓటర్ల నుంచి విశేష స్పందన!

**నాగాయలంకలో జడ్పీటీసీ అభ్యర్థి కొత్తపల్లి సరోజిని విస్తృత ప్రచారం**

నాగాయలంక, రూరల్ ప్రజాభూమి ప్రతినిధి



అవనిగడ్డ నియోజకవర్గంలోని నాగాయలంక మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందు కుంది. బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి కొత్తపల్లి సరోజిని ఏనుగు గుర్తుపై పోటీ చేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని చోడవరం, పెదపా లెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసు కుంటూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థి స్తున్నారు. ప్రచారంలో భా గంగా స్థానిక ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసు కుంటూ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని సరో జిని కోరుతున్నారు. ఏనుగు గుర్తుకు ప్రజల నుంచి మంచి స్పం దన లభిస్తోందని, ప్రచారానికి ఓటర్లు ఆదరణ చూపుతున్నారని ఆమె మద్దతుదారులు పేర్కొం టున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను నేరుగా కలుసుకోవడంపై అభ్యర్థి దృష్టి సారించారు. నాగాయలంక మండలంలో ఏనుగు గుర్తుపై సాగుతున్న ప్రచారం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రజల ఆదరణ తమ అభ్యర్థి విజయానికి దోహదపడుతుందని ప్రచార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఓటర్ల తీర్పు ఎన్నికల ఫలితాల్లో వెల్లడికానుంది.


Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

మంగళవారం 3 నవంబర్ 2026

# జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 5 కి.మీ రన్

- రూ.1.32 లక్షల నగదు బహుమతులు

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

ఫిట్ ఇండియా... హెల్దీ నేషన్ నినాదంతో కాకినాడ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 14 న భారీ ఐదు కిలోమీటర్ల రన్ పోటీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జనవిజ్ఞాన వేదిక నేత పెదపాటి నరసింహారావు ఆధ్వర్యంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్ ను రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో సంస్థ అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ సిహెచ్ రాజేష్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెదపాటి నరసింహారావు మాట్లాడుతూ రన్ ఫర్ ఎ బెటర్ టుమారో పేరుతో జరగనున్న ఈ పరుగు పందెం నవంబర్ 14( శనివారం) ఉదయం 5 గంటలకు భానుగుడి సెంటర్ లో జరుగుతుందని తెలిపారు. నాలుగు విభాగాల్లో పోటీలు



ఉంటాయన్నారు.నిర్వాహకులు ఈ పోటీని నాలుగు విభాగాలుగా విభజించారని తెలిపారు.18 ఏళ్ల లోపు బాలురు,18 ఏళ్ల లోపు బాలికలు,18 ఏళ్లు పైబడిన పురుషులు 18 ఏళ్లు పైబడిన మహిళల క్యాటగిరీలుగా విభజించినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ. 1,32,000 నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు.ప్రతి విభాగంలో ప్రథమ 6 స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నారు. ప్రతి విభాగంలో ఫస్ట్ కు రూ.10,000, సెకండ్ కు రూ.8,000, థర్డ్ కు రూ.6,000, ఫోర్త్ కు రూ.4,000, ఫిఫ్త్ కు రూ.3,000, సిక్స్త్ కు రూ.2,000 చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.నాలుగు విభాగాలకు కలిపి మొత్తం రూ.1,32,000 విలువైన బహుమతులను అందజేస్తారన్నారు.ఈ కార్యక్రమానికి చావలి లక్ష్మీ రమణి రావు స్పాన్సర్ గా వ్యవహరిస్తున్నాని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన పాల్గొనే వారికి సూచనలు చేసారు ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ప్రతి ఒక్కరికీ బిబ్ నంబర్ కేటాయించబడుతుందని,ఆ బిల్ నంబర్ స్క్రీన్ షాట్ తీసుకుని మొబైల్లో భద్రపరుచుకోవాని తెలిపారు.పోటీ రోజు ఉదయం 5 గంటలకు భానుగుడి సెంటర్ కు చేరుకుని, మొబైల్లో ఉన్న బిల్ నంబర్ చూపించి సంబంధిత బిబ్ నంబర్ తీసుకోవాలని పేర్కొన్నారు. బిబ్ నంబర్ తో మాత్రమే పోటీలో పాల్గొనాలని స్పష్టం చేశారు.మరిన్ని వివరాలకు నాగు- 9948012555, ప్రసాద్- 9000060987నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



# తాళ్లపూడిలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్.ఓ. ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రక్రియలో పలువురు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎంపీడీవో అమ్మిరాజు తెలిపారు. రెండు రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ కనపర్తి అమర్నాథ్‌కు మాతృ వియోగం



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

స్వాతంత్ర సమరయోధులు వరలక్ష్మికి ఘనంగా నివాళులర్పించిన నగర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు ప్రముఖ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ కనపర్తి అమర్నాథ్ మాతృ మూర్తి స్వాతం త్ర సమరయోధురాలు వరలక్ష్మి (97) స్థానిక రామకృ ష్ణాపురం తన స్వగృహంలో సోమవారం తుది శ్వాస వి డిచారు. ఆమెకు కుమారుడు అమర్నాథ్ సంతానం. వరలక్ష్మి భర్త కనపర్తి వెంకటేశ్వరరావు సబ్ రిజిస్టర్ గా సుమారు 35 సంవత్సరాలు సేవలందించారు. ఆమె మరణ వార్త తెలియగానే నగరంలోని ప్రముఖులు, వ్యా పారవేత్తలు, శ్రేయోభిలాషులు, కుమారుడు అమర్నాథ్ కు చరవాణి ద్వారా, స్వయంగా భౌతిక కాయని సందర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



## రామచంద్రపురంలో మున్సిపల్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- సిసి కెమేరాలు నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం
- మూడు రూములో 12 టేబుల్ ద్వారా ఓట్లు లెక్కింపు
- ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- మున్సిపాల్ కమీషనర్ రాజు

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరగనున్న ఓట్లు లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలియజేశారు.ఈసందర్భంగా ఆయన సోమవారం కౌంటింగ్ కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రామచంద్రపురంలో చింతపల్లి సూరన్న మున్సిపల్ హైస్కూల్ నందు ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని ఇందుకోసం మూడు రూములో 12 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు.వివాదాలకు తావులేకుండా ఓట్లు లెక్కింపు ప్రక్రియ సిసి కెమేరాలు నిఘాలో జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు అందరు సమక్షంలో స్ట్రాంగ్ రూములు ఓపెన్ చేస్తామని తెలిపారు. ఒకపక్క రాజకీయ పార్టీలు నేతలు, మరోపక్క అధికారులు అదికారులు ఉంటారని పేర్కొన్నారు.అలాగే బారీ పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని కమీషనర్ రాజు పేర్కొన్నారు.

# కొత్తపేటలో వైస్సార్సీపీకి షాక్



- ఎమ్మెల్యే సత్యానందరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన పలువురు వైస్సార్సీపీ కార్యకర్తలు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కుడుపూడి వెంకటేశ్వర రావు, కురచ బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సత్యానందరావు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కుడుపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వనుం నాగరాజు, కడలి ఏడుకొండలు, కడలి నాగరాజు, కడలి చిన్న త్రిమూర్తులు, దంగేటి రామకృష్ణ, కడలి తాతాజీ, దంగేటి నాగరాజు, దూనబోయిన ఏడుకొండలు, దంగేటి వి.వి. సత్యనారాయణ, దంగేటి లక్ష్మణరావు, దంగేటి శ్రీనివాసరావు, దూనబోయిన మాణిక్యాలరావు, దంగేటి ధర్మరాజు, కడలి రామలక్ష్మి, గుత్తుల శ్రీనివాసరావు, కడలి నాగభూషణం, కడలి లక్ష్మి, కొప్పిశెట్టి లక్ష్మి, దంగేటి అనసూయ, దంగేటి లక్ష్మి తదితరులు టీడీపీలో చేరారు. అలాగే కురచ బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కుడుపూడి కృష్ణారావు, గుత్తుల పెద సత్యనారాయణ, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, చెల్లిబోయిన వెంకటరమణ, వాసంశెట్టి గోవిందరావు, వాసం శెట్టి మహాలక్ష్మి, గుబ్బల సుబ్రహ్మణ్యం తదితరులు టీడీపీలో చేరారు. అలాగే అగ్నికుల క్షత్రియ వర్గానికి చెందిన అంకాడి రాంబాబు, పంతాడి శ్రీను, అంకాడి అన్నవరం, పొంతాడ కాంతారావు, పంతాడు సతీష్, కరప్రోలు నానాజీ, డొక్కాడ శ్రీను, కోలా లక్ష్మణ్, అంకాడి నాగరాజు, పంతాడి ధనరాజు, డొక్కాడ శ్రీనివాస్, డొక్కాడి సూరిబాబు, పెమ్మాడి శ్రీనివాస్, పెమ్మాడి కాయ రాజు, మసకపల్లి ఓం నమశ్శివాయ, పెమ్మాడి వెంకటేష్, అంకాడి రామరాజు, డొక్కాడి మెషిన్, అంకాడి వీర వెంకటేశ్వరరావు, అంకాడి శ్రీను, డొక్కాడి మాచరయ్య, కరుప్రోలు దుర్గారావు, అంకాడి సతీష్, కాలాడి శ్రీను, అంకాడి కాసులయ్య, అంకాడి కరుణ కుమార్, డొక్కాడి ధనుంజయ్, డొక్కాడి వెంకటరమణ, పంతాడి నాగరాజు, అంకాడి కొండలరావు, డొక్కాడి జీవన్ కుమార్, మసకపల్లి దుర్గాప్రసాద్, మల్లాడి గోవింద్, మల్లాడి రమేష్, పంతాడి చిన్నశ్రీను, పంతాడు వీరబాబు, పంతాడి అంజి రాముడు, పంతాడి దుర్గారావు, పంతాడి శ్రీరాములు, పంతాడి ఊదరాజు తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నూతనంగా పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలియజేసి, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## జడ్పిటిసిగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

ప్రజాభూమి ప్రతినిధి – చాట్రాయి.

చాట్రాయి మండల జడ్పిటిసి గా కాంగ్రెస్ పార్టీ తరఫున చాట్రాయి గ్రామానికి చెందిన సాధు బాబురావును మండల ప్రజలు తమ అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు సంటి అన్నారు. మండల కేంద్రమైన చాట్రాయిలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బలహీన బడుగు వర్గాల ప్రజలను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అభ్యర్థి సాదు బాబురావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాడపల్లిలో ఘనంగా ఐదో రోజు బ్రహ్మోత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం, కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం ఆశ్వయుజ బహుళ అష్టమి సందర్భంగా ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండప ఆరాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు నిర్వహించారు. దుష్టగ్రహ పరిహారార్థం మహా సుదర్శన హోమం అనంతరం స్వామివారికి తోమాల సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం స్వస్తి వాచనం, ప్రధాన హోమాలు, స్వామివారికి విశేషార్చన, చతుర్వేద స్వస్తి, దిగ్దేవతా బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి మలయప్ప అలంకరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ వాహన సేవను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమీషనర్ నల్లం సూర్య చక్రధరరావు బ్రహ్మోత్సవ ఏర్పాట్లు చేపట్టారు.





# మీ ఒక్క ఓటు ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుంది : మంత్రి పార్థసారథి





- గ్రామాభివృద్ధికి రూ.83 లక్షలు.. ఎస్సీ ప్రాంత అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం సూరవరం, కృష్ణవరం గ్రామాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. ప్రజలు వేసే ఒక్క ఓటు ఐదేళ్ల గ్రామ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సూరవరం గ్రామంలో సుమారు రూ.83 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఎస్సీ ప్రాంత అభివృద్ధికి సుమారు రూ.30 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రాష్ట్రంలోని 13 వేల గ్రామాల అభివృద్ధికి సుమారు రూ.11 వేల కోట్లు కేటాయించామని, పంచాయతీ తీర్మానం లేకుండా నిధులు ఖర్చు చేయకుండా నిబంధనలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తామని, రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో సుమారు 8 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టామని వివరించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం కారణంగా సుమారు 34 వేల మంది మరణించారని ఆరోపించారు. గ్రామంలో కాపు కళ్యాణ మండపానికి రూ.కోటి, ఈద్గా దర్గా అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేశామని, ఎస్సీ, బీసీ కళ్యాణ మండపాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు ధనలక్ష్మి, జోషి తదితరులు పాల్గొన్నారు.





## విజయోత్సవ సంబరాలకు ప్రజలు దూరంగా ఉండాలి

- 200 మంది పోలీసు సిబ్బంది తో కౌంటింగ్ వద్ద బందోబస్తు
- రామచంద్రపురం డిఎస్పీ శేషు

ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం

మున్సిపల్ ఎన్నికల విజయోత్సవ సంబరాలకు ప్రజలు దూరంగా ఉండాలని రామచంద్రపురం డి ఎస్పీ శేషు పిలుపునిచ్చారు.సోమవారం సాయంత్రం డి ఎస్పీ శేషు మీడియా తో మాట్లాడారు. ఊరేగింపులు,డి జే లు, బాణాసంచా కాల్పులు వంటివి పూర్తిగా నిషేధం ఉందన్నారు. ప్రస్తుతం సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కొనసాగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిసిన ఆనందంతో ర్యాలీలు డీజేలు, బాణాసంచా కాల్పులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక ప్రక్క సెక్షన్ 30 పోలీస్ శాఖ అమల్లో ఉందని, మరోపక్క జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల ప్రచారం చివరి దశలో ఉన్నందున ఎటువంటి ఊరేగింపులు ర్యాలీలు జరపరాదన్నారు. ఓడిన,గెలిచిన అభ్యర్థులు ఎవరు కూడా ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. గెలుపొందిన వారు, ఓడిపోయిన వారు మన వాళ్లే కింద భావించాలాన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానమైన కూడల్లో, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు నిఘా పెట్టాం అన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి సహకరించిన ప్రజలందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపిన డిఎస్పి శేషు. ఈ సమావేశం లో సి ఐ వెంకట నారాయణ, ఎస్ ఐ లు నాగేశ్వరరావు, లక్ష్మణ్ లు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్ 14

మంగళవారం 3 నవంబర్ 2026




## రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ పీఠంపై ఉత్కంఠ!

- అభ్యర్థుల్లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- క్రాస్ ఓటింగ్ జరిగిందంటూ ప్రచారం
- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

**గెలుపులో మహిళ ఓటర్లు కీలకం**

ప్రజభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపల్ ఎన్నిక ప్రశాంతంగా ముగియడంతో ఫలితాలపై నేతలు అంచనాలు వేస్తున్నారు. అయితే ప్రభుత్వ తాజా జీవో ప్రకారం మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిని నేరుగా ఓటర్లు ఎన్నుకునే పద్ధతి ద్వారా క్రాస్ ఓటింగ్ జరిగిందంటూ పట్నంలో ప్రచారం కొనసాగుతోంది. దీంతో చైర్ పర్సన్ అభ్యర్థులు ప్రభుత్వ నిర్ణయాన్ని తొలత స్వాగతించినప్పటికీ ప్రస్తుతం మాత్రం చైర్ పర్సన్ అభ్యర్థులు మనసులో క్రాస్ ఓటింగ్ సమస్య గెలుపు పై ఉత్కంఠ రేపుతుంది.అలాగే తమదే విజయం అంటూ అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా, 32వార్డుల కౌన్సిలర్ పదవులకు 69 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. చైర్ పర్సన్ పదవి కోసం కూటమి అభ్యర్థిగా మేడిశెట్టి శేషారావు, వైకాపా అభ్యర్థిగా చింతపల్లి నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోట వరలక్ష్మి, బిఎస్పి నుండి షేక్ అలీ నలుగురు పోటీలో ఉన్నప్పటికీ ప్రదానంగా కూటమి, వైకాపా పార్టీ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ రసవత్తరంగా కొనసాగింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 35,వేల 728 మంది ఓటర్లు ఉండగా ఆదివారం పోలింగ్ ముగిసే సరికి 21వేల 270 మంది తమ తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. వీరిలో 12వేల 129 మంది పురుషులు,13, వేల 141 మంది మహిళలు, ఉండగా పురుషులు కంటే ఒక వెయ్యి 12 మంది మహిళలు ఓటర్లు అత్యధికంగా తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో గెలుపు ఓటములు విషయంలో ప్రధానంగా మహిళాఓటర్లు కీలకం కానున్నారు.ప్రధాన పార్టీల నేతలు, కార్యకర్తల్లో గెలుపుపై అంచనాలు మొదలయ్యాయి. ఏ వార్డులో ఎవరికి అనుకూలంగా ఓటింగ్ జరిగిందనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అయితే ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలిచారన్నది మాత్రం అంతు చిక్కలేదు. కొన్ని వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఏకపక్షంగా ఓట్లు పడుతున్నాయని ఒక పార్టీ నేతలు అంచనా వేస్తుంటే, మరికొన్ని వార్డుల్లో తమదే పైచేయి అంటూ ప్రత్యర్థి పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, క్రాస్ ఓటింగ్ జరిగిందంటూ మరో ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. దీంతో అసలు ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ మరింత పెరిగింది. మరోవైపు రాజకీయ విశ్లేషకులు కూడా వివిధ వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ ఓటర్ల మనోగతాన్ని అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారు.ఓటర్లు మాత్రం ఈ విషయంలో చాలా తెలివిగా వ్యవహరించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఓటర్లు నిజంగా ఎవరికి మద్దతుగా నిలిచారో తెలుసుకోవడం రాజకీయ నాయకులకు, విశ్లేషకులకు అంతు చిక్కని విధించి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పైకి కనిపిస్తున్న మద్దతు ఓట్ల రూపంలోనూ ప్రతిఫలిస్తుందా? లేక ఓటర్లు తమ అసలు నిర్ణయాన్ని గోప్యంగా ఉంచారా ?అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రామచంద్రపురం మున్సిపల్ చైర్పర్సన్ పీఠం ఎవరికి దక్కనుందన్న అంశంపై పట్టణ ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతుంది. వార్డులవారీగా నమోదయ్యే ఓట్లు, అభ్యర్థులకు లభించిన మద్దతు, ఓటర్ల చివరి నిమిషం నిర్ణయాలు గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశముంది. రామచంద్రపురం మున్సిపాలిటీ పీఠం తమదేనని అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నా, ఓటర్ల మౌనం మాత్రం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను పెంచుతోంది. అంచనాలు నిజమవుతాయా? లేక ఓటర్లు ఊహించని తీర్పు ఇస్తారా? నేడు తేలనున్నది.

## కుకునూరులో కూటమి అభ్యర్థులకు మద్దతుగా భారీ ప్రచారం



ప్రజాభూమి కుకునూరు

కుకునూరులో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుకునూరు జడ్పీటీసీ అభ్యర్థి బొంతు కోమలదేవి, ఎంపీటీసీ అభ్యర్థులు పిచ్చుక రాజు, ఆసి శ్రీలత విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రచారం చేపట్టారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ అభ్యర్థులకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు భోజన వసతులు ఏర్పాటు చేయడంతో వారు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. భారీ జనసందోహంతో కుకునూరులో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది.

## 'మురసు' తుఫానుపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పార్థసారథి

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి


నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి 'మురసు' తుఫాను ముందస్తు సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగంతో వర్చువల్‌గా సమీక్షించారు. తుఫాను నవంబరు 3న బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# మురసు తుఫాను పట్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయం నుండి సోమవారం 'మురసు' తుఫాను ముందస్తు సహాయక చర్యలుపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, తుఫాన్ పరిస్థితి సహాయక చర్యలుపై వర్చువల్ లో జిల్లా యంత్రాంగంతో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమీక్షించారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పూర్తిసన్నద్ధతతో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని ఉన్నత అధికారులను ఆదేశించారు.



తుఫాను పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలుపై కార్యాచరణను సమీక్షించారు. తుఫాను ముప్పు దృష్ట్యా ప్రస్తుతం వాయుగుండం ఈ రోజు నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రతుఫానుగా మారే అవకాశం ఉందని, నవంబరు 03వ తేదీ ఉదయం బాపట్ల సమీపంలో తీరం దాటే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలియజేస్తుందని వివరించారు.

తుఫాను ప్రభావంపై ఎప్పటికప్పుడు బులెటిన్ విడుదల చేసి తుఫాను ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసి ముందస్తు జాగ్రత్త తీసుకోవాలి అధికారులకు మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు.



## ప్రజాసమస్యల పరిష్కారమే గెలుపుకు అస్త్రాలు

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

ముసునూరు మండలం ముసునూరు, చింతలవల్లి, గోపవరం, గోగులంపాడు గ్రామాల్లో సోమవారం టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో కూటమిపార్టీ శ్రేణులు,ముఖ్యనాయకులు, జెడ్పీటీసీ, యంపిటీసీలు పోటీచేస్తున్న అభ్యర్థులతో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారపౌరసంబంధాలుశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా సమావేశంలో నిర్వహించారు. పోటీచేస్తున్న అభ్యర్థులు,కూటమిపార్టీ శ్రేణులు,ముఖ్యనాయకులు, కార్యకర్తలు, భారీ మోటార్ సైకిల్స్ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. జెడ్పీటీసీ, యంపిటీసీలు ఎన్నికల్లో ప్రజలంతా కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు.ఈ సందర్భంగా ప్రచారరథం నుండి మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే ఎన్నికల్లో తమ అభ్యర్థులు విజయానికి బలమని ఆయన పేర్కొన్నారు. ముసునూరు మండలంలో రూ 120 కోట్లతో, ప్రతి గ్రామంలో 80 లక్షలు నుండి 1.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని తెలిపారు.అన్ని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు. ఈ పనులను దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాక్షస, విధ్వంసంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని, రాష్ట్ర మరో ఇరవైళ్ళు వెనక్కివెళ్లిందని అన్నారు. 36 నీటిప్రాజెక్టులు దశలవారీగా పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టుగోదావరిపుష్కరాలు లోపుగా పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామన్నారు. రాష్ట్రంలో యువతకు ఇరవైలక్షలు మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వైఎస్ఆర్సిపిపార్టీ విషసంస్కృతిలో మార్పురాలేదని ప్రజలు భావిస్తున్నారని, వైసీపీకి మరో అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజలతోపాటు భావితరాలు భవిష్యత్తు కూడా అంధకారంలో పడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైసీపీని రాజకీయంగా శాశ్వతంగా భూస్థాపితం చెయ్యాలనిపిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలు ప్రక్రియ మొదలైనప్పటి నుంచి, గొడ్డలిపార్టీ ఒక వ్యూహం ప్రకారం రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలిగిస్తుందన్నారని అన్నారు. ప్రజాబలం పూర్తిగా కోల్పోయిన గొడ్డలి పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే నిరాశతో ఎన్నికలు ప్రక్రియకు అడుగడుగునా అడ్డుతగులు తోందని, పార్టీ తరపున పోటీ చేయడానికి అభ్యర్థులే ముందుకు రాలేదని అన్నారు. తమ బలహీనతను కప్పిపుచ్చు కోవడానికే మమ్మల్ని నామినేషన్ వేయనీయడం లేదంటూ, కోర్టులకు కెక్కిన విషయం ప్రజలు కల్లారా చూస్తున్నారన్నారు. రఫా రఫ్పా అంటూ రక్తపాతం, రౌడీయిజం,కక్షసాధింపులు, ప్రజలను భయపెట్టడం, అడ్డదారుల్లో అధికారంలోకిరావాలను కోవడం గొడ్డలి పార్టీజెండా, అజెండా అని తెలిపారు.కేంద్రంలో, రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కారు నడుస్తోందనీ, స్థానిక ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపించడం వల్ల త్రిబుల్ ఇంజన్ సర్కారు అవుతుందని మంత్రి తెలిపారు. నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నామని, ప్రజలు అంతా బాసటగా నిలవాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు.?ఈ కార్యక్రమంలో పోటీచేస్తున్న అభ్యర్థులు, కూటమిపార్టీ నాయకులు, మండల, గ్రామస్థాయి ప్రముఖులు, నాయకులు, ఎక్కువ సంఖ్యలో మహిళలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- మండలవ్యాప్తంగా 144 సెక్షన్ అమలు -- పోలింగ్ కేంద్రాల వద్ద గుమిగూడితే కేసులు నమోదు: ఎస్పై వి. సురేష్

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి



గురువారం జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఆగిరిపల్లి మండలవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్పై వి. సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాభూమి ప్రతినిధితో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మండలంలోని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, ప్రశాంతంగా వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడటం, గుంపులుగా తిరగడం, ఇతరులను ప్రభావితం చేయడం, గొడవలకు దిగడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఎవరైనా ఎన్నికల సమయంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించే వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పై వి. సురేష్ కోరారు.

## మురసు తుఫాన్ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి

మురసు తుఫాన్ నేపథ్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుఫాన్ ప్రభావం, భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షించారు.

ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, వివిధ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు (సీఈలు), సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఈరోజు సాయంత్రం నెల్లూరు--ఒంగోలు మధ్య మురసు తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కృష్ణా, పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడి నుంచి వచ్చే వరద ప్రవాహాలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. గుండ్లకమ్మ, రాళ్లపాడు రిజర్వాయర్లకు వరద వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాజెక్టుల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## తుఫాన్ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కె.వైట్రీ సెల్వి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

మురసు తుఫాన్ ప్రభావం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్ సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మురసు తుఫాన్ కారణంగా భారీ వర్షాలు, తీవ్ర గాలులు వీచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రాణ, ఆస్థి నష్టాల నివారణపై జిల్లాల కలెక్టర్లు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని,



తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు నీటిని నింపేలా సమర్థ నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి జిల్లాలో తుఫాన్ సన్నద్ధతపై తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలను సీఎంకి తెలియజేసారు. మురసు తుఫాన్ ప్రభావం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, తుఫాన్, భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు సంబంవించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించండి : అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఓటర్లకు బొరగం పిలుపు

ప్రజాభూమి, ప్రతినిధి వేలేరుపాడు

తమ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు, సంక్షేమం రెండు కళ్ళుగా అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందిస్తున్నామని, అది చూసి కూటమి అభ్యర్థుల విజయానికి దోహదపడాలని తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర ట్రై కార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో జరుగుతున్న ప్రచారంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్ని విధాలుగా కష్టాలు పడ్డారో అందరికీ తెలిసిందే అన్నారు. రహదారుల విషయం కనీసం పట్టించుకోకపోవడంతో ప్రయాణం చేయాలంటే ఎంతో ఇబ్బంది పడేవారని, సంక్షేమ పథకాల విషయంలో ఒకరికి న్యాయం జరిగితే ఇద్దరకు అన్యాయం జరిగేదని గుర్తు



చేశారు. పెన్షన్ల విషయంలో సంవత్సరానికి ?250 పెంచి వృద్ధులను నిరాశకు గురి చేయటం గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూ, సంక్షేమ పథకాలను నిరాటంకంగా ఒకటవ తేదీనే పెన్షన్ల పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. పోలవరం విషయంలో నిర్వాసితులకు నిరాశ మిగిల్చిన వైసిపి ప్రభుత్వం చిన్నచిన్న గ్రామాలను ఎంచుకొని ఆ గ్రామంలో సైతం కొందరికి మాత్రమే పరిహారాలు అందించేదని, మిగిలిన వారంతా ఎదురుచూపుల్లో ఉండేవారని పేర్కొన్నారు. అటువంటిది చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తక్షణం ప్ర ప్రథమంగా పోలవరం నిర్వాసితులకు 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాల వారందరికీ ఆర్ అండ్ ఆర్ పరిహారాలు, గృహ నష్టపరిహారాలు అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా పునరావాస కాలనీలో ఆమోదయోగ్యమైన గృహ నిర్మాణాలు చేపట్టి, పట్టాల పంపిణీ సైతం చాలా వరకు చేయటం అందరికీ తెలిసిందే అన్నారు. ఈ విధంగా ఆమోదయోగ్యమైన పరిపాలన సాగించే ప్రభుత్వాన్ని గుర్తించి సైకిల్ గుర్తుపై తమ యొక్క అమూల్యమైన ఓటు వేసి అభివృద్ధి ప్రదాతలుగా మీ మండలం నుంచి ప్రజాప్రతినిధులను అందించాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో వైసీపీకి చెందిన పలువురు బొరగం సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అమరవరపు అశోక్, జడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 15

మంగళవారం 3 నవంబరు 2026

చొకనపల్లి అటవీ ప్రాంతంలో

## నాటుసారా బట్టాపై పోలీసుల దాడి

400 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలో నాటుసారా తయారీ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని చొకనపల్లి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 400 లీటర్ల బెల్లం ఊటతో పాటు, తయారు చేసిన 20 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకొని అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించి ఈ దాడి చేపట్టినట్లు ఎస్ఐ సాదిక్ తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మండల పరిధిలో ఎక్కడైనా నాటుసారా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అక్రమ మద్యం తయారీని అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

మురసు తుపాను ప్రభావిత జిల్లాల్లో వైద్య సేవలు యథాతథం

## మురసు తుపాను ప్రభావిత జిల్లాల్లో వైద్య సేవలు యథాతథం

- 13 జిల్లాల్లో 724 వైద్య బృందాలు..
- 4,628 అత్యవసర పడకలు సిద్ధం
- 3,066 మంది గర్భిణుల్లో 1,103 మంది ఆస్పత్రులకు తరలింపు
- అంబులెన్స్ సేవలు ఆర్టీజీఎస్‌తో అనుసంధానం

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

మురసు తుపాను నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంది. ప్రభావితమయ్యే అవకాశం ఉన్న 13 జిల్లాల్లో 724 వైద్య బృందాలు, 4,628 అత్యవసర పడకలు, 205 సహాయ శిబిరాలను సిద్ధం చేసింది. 866 ప్రభుత్వ వైద్యశాలల్లో 398 వైద్యశాలలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. 359 అంబులెన్సులు (108), 128 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు (102), 320 సంచార వైద్య వాహనాలు (104) అందుబాటులో ఉంచారు. అంబులెన్స్ సేవలను ఆర్టీజీఎస్ పోర్టల్‌తో అనుసంధానించారు. సుమారు 300 ప్రైవేటు అంబులెన్సులను కూడా ఆర్టీజీఎస్ పోర్టల్‌తో అనుసంధానించారు. ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) ద్వారా అంబులెన్సుల వివరాలను ఒకే డిజిటల్ వేదికపై పర్యవేక్షిస్తారు. తుపాను సమయంలో అత్యవసర వైద్య సేవలను వేగంగా అందించడంతో పాటు, అవసరమైన ప్రాంతాలకు అంబులెన్సులను సమర్థంగా కేటాయించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుంది. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో అంటువ్యాధుల నిఘా కేంద్రాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**గర్భిణుల తరలింపు**

నవంబర్ 1 నుంచి 10వ తేదీ మధ్య ప్రసవ గడువు ఉన్న 3,066 మంది గర్భిణులను గుర్తించగా, 1,103 మందిని సమీప ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన వారిని అవసరాన్ని బట్టి ముందుగానే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారి నివాస ప్రాంతాలను బట్టి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవ సదుపాయాలు కల్పిస్తున్నారు.

**కొనసాగుతున్న వైద్య సదుపాయాలు**

తీర ప్రాంతాల్లోని 121 ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. పాముకాటు నివారణకు 15,161 ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. 848 వైద్యశాలల్లో జనరేటర్లు, ప్రత్యామ్నాయ విద్యుత్తు సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. నీరు, దోమలు, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నీటి శుద్ధికి క్లోరిన్ మాత్రలను సిద్ధం చేశారు. సురక్షిత తాగునీటి సరఫరాకు పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, పురపాలక శాఖలతో సమన్వయం చేస్తున్నారు. ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.తుపాను సన్నద్ధతకు చేపట్టిన ఏర్పాట్ల వివరాలను అధికారులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు.

# జీడిగుప్పలో కూటమి అభ్యర్థుల జోరైన ప్రచారం

సైకిల్, గాజుగ్లాసు గుర్తులపై ఓటేసి గెలిపించండి: విష్ణుప్రియ, హేమలత





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం



వి.ఆర్.పురం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా కూటమి నాయకులు బలపరిచిన జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిని వాళ్ల విష్ణుప్రియ, జీడిగుప్ప ఎంపీటీసీ జనసేన అభ్యర్థిని కనుగుల హేమలత సోమవారం జీడిగుప్ప, ఇసునూరు, కొండదరి, రాయిగూడెం గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై, ఎంపీటీసీ ఎన్నికల్లో గాజుగ్లాసు గుర్తుపై తమ అమూల్యమైన ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ పునరావాసం, పరిహారం, ఇతర ప్యాకేజీల విషయంలో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో మరింత చొరవ తీసుకునేలా స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో మరింత అభివృద్ధి జరగాలంటే ప్రజల సహకారం అవసరమని అభ్యర్థులు పేర్కొన్నారు. తమను గెలిఎ స్తే మండలంలోని గ్రామాల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి అభ్యర్థులకు ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో సైకిల్, గాజుగ్లాసు గుర్తులకు ఓటేసి తమను గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

- నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు
- జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

కాకినాడ జిల్లాలో ఈ నెల 5వతేదీన నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుత,నిష్పక్షపాత, పారదర్శకవాతావరణం లో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికల నియమావళి అమలు,భద్రతా చర్యలు తదితర అంశాలపై సోమవారం కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలునిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రచార ప్రక్రియ నుంచి పోలింగ్, బ్యాలెట్ బాక్సుల భద్రపరచడం,ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ ఎన్నికల నిబంధనలు,ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలికసదుపాయాలు కల్పించడంతో పాటు, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలు,ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతాఏర్పాట్లుచేపడుతున్నామని,



ఎన్నికల విధులకు నియమించిన సిబ్బందికి అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియ లో విధులు నిర్వహించే అధికారులు,సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని,ప్రతి దశలోనూ పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు,ప్రజలు జిల్లా యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.ఈ సమావేశంలో జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగానిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు,ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు,వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్న కార్యక్రమాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు జడ్పీ సీఈఓ లక్ష్మణ రావు వివరించారు.

ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ డి. శ్రీలలిత, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్. అప్పారావు (బీఎస్పీ), సీహెచ్. రమేష్ (బీజేపీ), పి. వీరబాబు (సీపీఎం),పి. శ్రీనివాసు (ఐఎన్సీ),జి. సాయిబాబా (టీడీపీ), ఎ. సత్యనారాయణ (జనసేన), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్సార్‌సీపీ),ఎన్నికల విభాగానికి చెందిన ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను

# ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలి

- కౌంటింగ్ విధి విధానాలు,అధికారుల విధులు,బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.
- జిల్లా రిటర్నింగ్ అధికారి,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

కాకినాడ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జడ్పీటీసీ జిల్లా రిటర్నింగ్ అధికారి, అపూర్వ భరత్ అధికా రులకు సూచించారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు సంబంధించి సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో రిటర్నింగ్ అధికారులు (=ూ), సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి,కౌంటింగ్ రోజున అధికారులు అనుసరించాల్సిన విధి విధానాలు,నిర్వహించాల్సిన బాధ్యతలపై సమగ్రంగా దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అధికారి తమకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంభం నుంచి ఫలి తాల ప్రకటన వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వ హిస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేలా వ్యవహరించాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు,కౌంటింగ్ టేబుళ్లు,సిబ్బంది విధుల కేటాయింపు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అభ్యర్థుల కౌంటిం గ్ ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు చేపట్టాలన్నారు.బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, భద్రత, సీల్స్ పరిశీలన, బ్యాలెట్ పత్రాల వర్గీకరణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లుబాటు అయ్యే, చెల్లని బ్యాలెట్ పత్రాలను గుర్తిం చడంలో నిర్దేశిత నిబంధన లను




ఖచ్చితంగా పాటించాలని,సందేహాస్పద బ్యాలెట్ పత్రాల విషయం లో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.కౌంటింగ్ హాల్ లో అనుమతించే అధికారులు, సిబ్బంది,ఏజెంట్ల గుర్తింపు కార్డులు,అనుమతి పాసులను క్షుణ్ణంగా పరిశీలించాలని,అనధికార వ్యక్తులకు ప్రవేశం కల్పించకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బహుళ అంచెల భద్రతా ఏర్పా ట్లను పర్యవేక్షిస్తూ, కౌంటింగ్ హాల్ లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓట్ల లెక్కింపు పూర్తయిన ప్రతి దశలో సంబంధిత ఫారాల్లో వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, ప్రతి రౌండ్‌లో లెక్కించిన ఓట్ల వివరా లను సరిచూసిన అనంతరం నిబంధనల ప్రకారం ప్రకటించాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియలో అధికారులు పూర్తి అవగాహనతో, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో క్రమశిక్షణ,పారదర్శకత, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.కౌంటింగ్ సమయంలో అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు వ్యక్తం చేసే అభ్యంతరాలు,సందే హాలను ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించి తగినచర్యలుతీసుకోవాలని సూచిం చారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ,కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియపై సమగ్రమైన అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సి ఈ ఓ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో శ్రీ లలిత, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా స్థాయి కౌంటింగ్ సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ రూరల్ / పిఠాపురం:



జిల్లాలో నవంబర్ 05 న జరగనున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ(ఎంపీటీసీ) జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ(జెడ్పీటీసీ) స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లో భాగంగా కాకినాడ గ్రామీణం,పిఠాపురం మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ పత్రాల జారీ,ఓటు నమోదు, బాలెట్ బాక్సులు భద్రపరచే విధానం,వంటి అంశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ లో కీలక పాత్ర పోషిస్తున్న అధికారులకు, సిబ్బందికి తమప్రజాస్వామ్య హక్కు అయిన ఓటును వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు, తాగునీటి సదుపాయాలు పక్కాగా కల్పిం చాలని అధికారులను ఆదేశించారు. ఓటింగ్ ప్రక్రియ అంతా నిబంధనలకు అనుగుణంగా,అత్యంతపారదర్శకమైన వాతావరణం లో, పూర్తి భద్రత నడుమ జరగాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ పెట్టెల భద్రత విషయంలో ఎలాంటి అజాగ్రత్తకూ తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అప్రమత్తత తో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ రూరల్ మండలం రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్, ఎం పి డి ఓ సతీష్; పిఠాపురం మండలం రిటర్నింగ్ అధికారి స్వప్న, ఎంపీడీవో డీడీవో ఎం.కృష్ణ వేణి స్థానిక ఎన్నికల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.